

వాన.. వేదన

● పంటను సంరక్షించుకునేందుకు రైతుల పాట్లు



తీరంలో లంగరు వేసిన పడవలు

భోగాపురం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి)

తుఫాన్ ప్రభావంతో మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే తెగుళ్లు, వర్షాభావంతో పంటలు దెబ్బతిన్నాయని, మిగిలిన పంట చేతికి అందివచ్చే సమయంలో తుఫాన్ కొంప ముంచుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పొలాల్లో వరి పంటను కాపాడుకునేందుకు నానా పాట్లు పడుతున్నారు. కొందరు రైతులు పొలాల్లోనే వరి కుప్పలు పెట్టి వర్షానికి తడవకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. మరోవైపు గాలులకు పలుచోట్ల వరి చేలు నేలవాలాయి. ప్రస్తుతం కొంత పంట కోయకుండా ఉండగా మరికొంత పంట పనలుగా, కుప్పలుగా పొలాల్లోనే ఉంది. వరికుప్పల చుట్టూ నీరు ఉండడంతో ధాన్యం గింజలు నాని మొలకలు వస్తాయని రైతులు కలవరపడు తున్నారు. తీరంలో మత్స్యకారులు ఎవరూ సముద్రంలోకి వేటకు వెళ్లలేదు. పనులు లేక అవస్థలు పడుతున్నారు. వలలు కట్టుకొనే పనిలో నిమగ్నమయ్యారు.



నెల్లిమర్ల మండలం సతివాడలో వరిపంట కుప్పల చుట్టూ చేరిన వర్షం నీరు



ఆక్రమణలకు గురవుతున్న సారధి చెరువు

చెరువునూ వదలరా?

- అక్రమార్కుల చెరలో సారధి చెరువు
- రూ.50 కోట్ల భూమి కబ్జా
- 20 ఎకరాల్లో అక్రమ నిర్మాణాలు
- పట్టించుకోని అధికారులు

రాజాం మునిసిపాల్టీ పరిధిలోని చెరువు అది. ఒకప్పటి సారధి, రాజాం మేజర్ పంచాయతీల పరిధిలో ప్రజలకు సాగు, తాగునీటి అవసరాలు తీర్చేది. క్రమేపీ చెరువు ఆక్రమణలకు గురవుతోంది. చుట్టుపక్కల నివాసితులతో పాటు స్థానికులు కొంచెం కొంచెం ఆక్రమిస్తుండడంతో కుచించుకుపోతోంది. కోట్లాది రూపాయల ప్రభుత్వ భూమి అన్యాక్రాంతం అవుతోంది. 20 ఎకరాల్లో అక్రమ నిర్మాణాలు వెలిశాయి. అయినా అధికారులు నిర్మాణాత్మక చర్యలకు దిగడం లేదు.

రాజాం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి):

సారధి మేజర్ పంచాయతీది సుదీర్ఘ చరిత్ర. ఈ పంచాయతీ పరిధిలో ప్రభుత్వ భూములు, చెరువులు, కాలువలు అధికం. తొలుత రాజాం నగర పంచాయతీలో సారధిని విలీనం చేశారు. అటు తరువాత రాజాం మునిసిపాల్టీగా మారడంతో సారధి పంచాయతీ ఆనవాళ్లు కోల్పోయాయి. ప్రభుత్వ భూములు అక్రమార్కుల చేతిలోకి వెళ్తున్నాయి. సర్వే నంబర్ 119లో 260 ఎకరాల్లో చెరువు ఉండేది. ఏడాది పొడవునా నీటితో కళకళలాడేది. సారధి పంచాయతీ ప్రజల సాగు, తాగునీటి అవసరాలు తీర్చేది. అయితే రాజాం పట్టణం విస్తరించడంతో చెరువు చుట్టూ నివాసాలు పెరిగాయి. శివారు కాలనీలు విస్తరించాయి. దీంతో అక్రమార్కుల కన్ను ఈ చెరువు భూమిపై పడింది. క్రమేపీ చుట్టు పక్కల భూమిని ఆక్రమించుకుంటూ వస్తున్నారు. ఇప్పటివరకూ ఇక్కడ 20 ఎకరాల వరకూ ఆక్రమణకు గురైంది. ప్రస్తుతం ఇక్కడ సెంటు భూమి ధర రూ.2 లక్షల నుంచి రూ.5 లక్షల వరకూ పలుకుతోంది. ఇలా ఆక్రమణలకు గురైన భూమి రూ.50 కోట్లు వరకూ ఉంటుందని ఒక అంచనా. ఇంత జరుగుతున్నా మునిసిపల్ అధికారులు కానీ.. ఇరిగేషన్ అధికారులు కానీ అటువైపుగా చూడకపోవడం ఆందోళన కలిగిస్తోంది.

నిర్లక్ష్యం వీడని అధికారులు..

రాజాం మునిసిపాల్టీకి పాలకవర్గం లేదు. 20 సంవత్సరాలుగా ఇదే పరిస్థితి. మునిసిపాల్టీపై రాజకీయ ప్రభావం మాత్రం అధికంగా ఉంది. అందుకే మునిసిపల్ స్థలాలకు రక్షణ లేకుండా పోతోంది. అయితే సారధి చెరువు ద్వారా 450 ఎకరాల ఆయకట్టుకు (మిగతా 8వ పేజీలో..)



సారధి చెరువు స్థలంలో ప్రహరీ

చర్యలు తీసుకుంటాం..

ప్రభుత్వ భూములను ఆక్రమించడం నేరం. చెరువు భూమి ఆక్రమణలకు గురైనట్టు ఫిర్యాదులు వస్తున్నాయి. దీనిపై ప్రత్యేకంగా దృష్టిసారించాం. పరిశీలించాలని సిబ్బందికి సూచించాం. అవసరమైతే ఆక్రమించిన వారికి నోటీసులిస్తాం. అక్కడ బోర్డులు సైతం ఏర్పాటుచేస్తాం. చెరువు పరిరక్షణపై ప్రభుత్వానికి నివేదిస్తాం.

-ఎస్ కృష్ణంరాజు తహసీల్దారు, రాజాం

బాధాకరం..

సారధి చెరువుకు ఎంతో చరిత్ర ఉంది. ఈ చెరువు నీటిని తాగునీరుగా వాడుకున్న సందర్భాలు కూడా ఉన్నాయి. రైతులకూ ఎంతగానో ఉపయోగపడే ఈ చెరువు ఆక్రమణలకు గురవుతుండడం బాధాకరం. దీనిపైఅధికారులు దృష్టిపెట్టాలి. చెరువును అభివృద్ధి చేయాలి.

-టంకాల వెంకటేష్, రైతు, సారధి

అందని నీరు..

ఆయకట్టుకు సాగునీరు అందడం లేదు. అందుకు ఆక్రమణలే ప్రధాన కారణం. దీనిపై అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందించలేదు. ఆక్రమణలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. ఇప్పటికైనా కలెక్టర్ స్పందించి సత్వర చర్యలు చేపట్టాలి. లేకుంటే చెరువు గర్భాన్ని సైతం వదిలేలా లేరు.

-టంకాల కన్నంనాయుడు, రైతు, సారధి



గంజాయిపై యుద్ధం

- నిఘా పెంచిన జిల్లా పోలీసులు
- సంకల్పం పేరుతో విస్తృతంగా అవగాహన సదస్సులు
- 'ఈగల్' దళాన్ని కేటాయిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం

విజయనగరం, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి):

జిల్లాలో గంజాయి ఆనవాళ్లే కనిపించకూడదని.. రవాణాకు, వినియోగానికి కించిత్ అవకాశం ఉండకూడదని పోలీసులు సంకల్పించారు. మత్తు పదార్థాల రహిత జిల్లాగా మార్చేందుకు కంకణం కట్టుకున్నారు. ఇందులో భాగంగా 'సంకల్పం' కార్యక్రమం ద్వారా మత్తు పదార్థాల వినియోగంతో జరిగే అనర్థాలపై అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నారు. మరోవైపు విస్తృతంగా వాహన తనిఖీలు చేపడుతున్నారు. గత నెల 30న జిల్లా పర్యటనకు వచ్చిన హోంమంత్రి అనిత కూడా రాష్ట్రవ్యాప్తంగా గంజాయి, మత్తుపదార్థాల వినియోగంపై ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతోందని, ఇందుకోసం 'ఈగల్ సెల్' ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. 26 జిల్లాల్లోనూ ఈగల్ కంట్రోల్ సెల్స్ రానున్నాయి. అమరావతిలో రాష్ట్రస్థాయి నార్కోటిక్ పోలీస్‌స్టేషన్ ఏర్పాటుకానుంది.

వైసీపీ హయాంలో మద్యం, మత్తు పదార్థాల నియంత్రణకు ప్రత్యేకంగా స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరోను ఏర్పాటుచేసింది. అందుకోసం ఎక్సైజ్ శాఖను అడ్డగోలుగా విభజించింది. అరకొర సిబ్బందితో మద్యం, మత్తు పదార్థాల నియంత్రణ సాధ్యం కాలేదు. నాసిరకం మద్యం, ఆపై మద్యం ధరల పెరుగుదల కారణంగా గంజాయి, సారా చలామణి పెరిగిపోయింది. దీంతో ఎక్కడికక్కడే గంజాయి పట్టుబడింది. పెద్ద ఎత్తున ఒడిశా నుంచి జిల్లా మీదుగా రవాణా సాగింది. కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత కూడా పెద్ద ఎత్తున గంజాయి పట్టుబడుతూనే ఉంది. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం సీరియస్‌గా దృష్టిపెట్టింది. ఈ నేపథ్యంలోనే ఈగల్‌ను రంగంలోకి దించుతోంది.

జిల్లా మీదుగా గంజాయి రవాణాతో పాటు చలామణి కూడా అధికమైంది. ఇటీవల వరుసగా గంజాయి అక్రమ రవాణాదారులు పట్టుబడుతున్నారు. నిందితుల్లో ఉత్తరాది రాష్ట్రాల వారే అధికంగా ఉన్నారు. వారు విజయనగరంతో పాటు జిల్లాలో ప్రధాన పట్టణాల్లో స్థావరాలు ఏర్పాటుచేసుకుంటున్నారు. విశాఖ ఏజెన్సీతో పాటు పార్వతీపురం మన్యం, ఒడిశాలో సాగుచేస్తున్న గంజాయిని మన జిల్లా మీదుగా ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. ప్రధానంగా అరకు ప్రాంతానికి ప్రధాన మార్గంగా ఉన్న ఎస్.కోట, కొత్తవలస రోడ్డు పైనుంచే గంజాయి తరలిపోతోంది. మరోవైపు పార్వతీపురం మన్యం నుంచి రైలు, రోడ్డు మార్గం గుండా కూడా గంజాయి తరలింపు యథేచ్ఛగా సాగుతోంది. వీటిని నియంత్రించేందుకు సరైన వ్యవస్థ అంటూ లేదు. పోలీస్, సెబ్, రైల్వేపోలీసులు టీంగా ఏర్పడి పట్టుకునేవారు. సొంత శాఖల పనులు చూస్తూ గంజాయి నియంత్రణ సాధ్యమయ్యేది కాదు. ఇప్పుడు అదే పనిగా ఉండే ఈగల్ టీమ్ రంగంలోకి దిగనుంది.

త్వరితగతిన విచారణ

గంజాయి కేసులను వీలైనంత త్వరగా విచారణ పూర్తిచేయనున్నారు. వెనువెంటనే నిందితులకు శిక్షలు అమలుచేయనున్నారు. ఇందుకుగాను రాష్ట్ర వ్యాప్తంగా ఐదుచోట్ల ఫాస్ట్ ట్రాక్ కోర్టులను అందుబాటులోకి తేనున్నారు. ఉత్తరాంధ్రకు సంబంధించి విశాఖలో ఏర్పాటుచేసే ఈ కోర్టులో గంజాయి కేసులను వీలైనంత త్వరగా విచారణ పూర్తిచేయను న్నారు.

గంజాయి రహిత జిల్లాయే లక్ష్యం

గంజాయి రహిత జిల్లాగా తీర్చిదిదేందుకు జిల్లా పోలీస్ యంత్రాంగం కృషి చేస్తోంది. ఇందుకోసం సంకల్పం కార్యక్రమాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్తున్నాం. గంజాయితో పట్టుబడిన వారు ఎంతటివారైనా చర్యలు తప్పవు. రాష్ట్ర ప్రభుత్వం గంజాయి, డ్రగ్స్ నియంత్రణపై ప్రత్యేకంగా దృష్టిపెట్టింది. ఈగల్ టీంలను ఏర్పాటు చేస్తోంది.

- వకుల్‌జిందాల్, ఎస్పీ

లోతుగా విచారణ

● ప్రమాద స్థలాన్ని పరిశీలించిన అధికారులు

భోగాపురం, డిశంబరు1(ఆంధ్రజ్యోతి): పోలిపల్లి సమీపం జాతీయ రహదారిపై శని వారం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదానికి కారణాలను విశ్లేశించేందుకు జిల్లా ట్రాన్స్‌పోర్టు కమిషనర్ డి.మణికుమార్, జాతీయరహదారి ఇంజినీర్ మల్లిఖర్జునరావు, మోటర్‌వెహికల్ ఇన్‌స్పెక్టర్ దుర్గాప్రసాద్, సీఐ ఎన్వీ ప్రభాకర్ ఆదివారం ప్రమాద స్థలాన్ని పరిశీలించారు. కారు ఎక్కడ డివైడర్ ఎక్కింది... డివైడర్ ఏవిధంగా పగిలింది.. టైర్ పంక్షర్ అయి డివైడర్ ఎక్కి అవతలి రోడ్డుపైకి వెళ్లిందా లేక లారీని ఢీకొన్న తరువాత టైర్ పంక్చర్ అయిందా... డివైడర్ సమీపంలో నీరు ఏమాత్రం నిల్వ ఉంది.. కారు వేగం, స్టీరింగ్ సమస్య ఉందా, తదితర అంశాలపై చర్చించారు. నుజ్జునుజ్జయిన కారును అనువణువూ పరిశీలించారు. ఉన్నతాధికారులకు నివేదిక అందిస్తామని తెలిపారు. కాగా జాతీయ రహదారిపై వర్షపునీరు నిల్వ లేకుండా చర్యలు తీసుకోవాలని విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు ఎన్‌హెచ్ అధికారులకు ఆదివారం ఫోన్‌లో సూచించారు. శ్రీకాకుళం జిల్లా రణస్థలం వద్ద కూడా రోడ్డుపై అధికంగా నీరు నిల్వ ఉంటోందన్నారు.



కారును పరిశీలిస్తున్న పోలీస్ అధికారులు

ఎయిడ్స్ బాధితులకు భరోసా ఇవ్వాలి: కలెక్టర్ అంబేడ్కర్

విజయనగరం కలెక్టరేట్, డిసెంబరు1(ఆంధ్రజ్యోతి): ఎయిడ్స్ బాధితులకు భరోసా ఇవ్వాలని, తద్వారా వారిలో ఆత్మస్థైర్యం నింపడానికి కృషి చేయాలని కలెక్టర్ అంబేడ్కర్ సూచించారు. ప్రపంచ ఎయిడ్స్ డే సందర్భంగా ఆదివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎయిడ్స్ నిర్మూలనకు ప్రభుత్వం అన్ని రకాలు చర్యలు తీసుకుంటోందన్నారు. ఈ సంవత్సరం జిల్లాలో 425 కేసులు నమోదయ్యాయని, ఈ నేపథ్యంలో ఎయిడ్స్ నివారణపై ప్రజలకు అవగాహన పెంచడం ద్వారా వ్యాధి వ్యాప్తి చెందకుండా నిరోధించగమని చెప్పారు. ఈ వ్యాధిగ్రస్తులు ఊహాగానాలకు తావు లేకుండా క్రమం తప్పకుండా మందులు వేసుకుని పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా ఆయుర్థాయం పెరుగుతుందన్నారు. అనంతరం ఎయిడ్స్ బారిన పడిన విద్యార్థులతో కలిసి కలెక్టర్ బంగ్లాలో సహపంక్తి అల్పాహారంలో పాల్గొన్నారు. అంతకుముందు స్థానిక కాంప్లెక్స్ నుంచి కలెక్టరేట్ వరకూ ర్యాలీ జరిగింది.

ఆ నిర్మాణాల సంగతేంటి?



నిబంధనలకు విరుద్ధంగా ఓ భవన నిర్మాణం

- నగరంలో ఇష్టారాజ్యంగా కట్టడాలు
- అనుమతులు ఒకలా.. పనులు మరోలా
- చిన్న రోడ్డులో బహుళ అంతస్థుల నిర్మాణాలు
- కన్నెత్తి చూడని ప్లానింగ్ అధికారులు
- పేదలపై మాత్రం అజమాయిషీ

విజయనగరంలో అక్రమ నిర్మాణాలకు అడ్డు అదుపూ లేకుండా పోయింది. వైసీపీ హయాంలో రాజకీయ నాయకుల అండదండలతో యథేచ్ఛగా అక్రమ నిర్మాణాలు చేపట్టారు.. అనుమతులు ఒకలా పొంది.. నిర్మాణాలు మరోలా చేపట్టారు.. నేటికీ దర్జాగా అదే పంథా కొనసాగిస్తున్నారు. చర్యలు తీసుకోవాల్సిన టౌన్ ప్లానింగ్ అధికారులు అటువైపు కన్నెత్తి చూడడం లేదు. కేవలం కొందరికి నోటీసులు ఇచ్చి చేతులు దులుపుకున్నట్లు తెలిసింది.

విజయనగరం రింగురోడ్డు, డిసెంబరు1(ఆంధ్రజ్యోతి):

విజయనగరం జనాభా పెరుగుతోంది.. మరో పక్క భవంతుల సంస్కృతి వేళ్లానుకుంటోంది. కంటోన్మెంట్, ఉడాకాలనీ, రింగురోడ్డు, దాసన్నపేట, తోటపాలెం, నాయుడు కాలనీ, బాబామెట్ట, డాబాతోట, ఫూల్‌బాగ్, ప్రదీప్‌నగర్ తదితర ప్రాంతాల్లో శరవేగంగా నిర్మాణా లు సాగుతున్నాయి. అయితే అక్రమ భవనాలు పెరుగుతున్నాయి. బేస్‌మెంట్ సమయంలో అధికారు లను తీసుకొచ్చి అంతా బాగా చేస్తున్నట్లు చూపించడం.. ఆపై నచ్చినట్లు చేయడం సర్వసాధా రణంగా మారింది. 15 అడుగుల వెడల్పు రహదారిలో బహుళ అంతస్థుల భవనాలు నిర్మిస్తున్నారు. భవిష్యత్తులో ఏదైనా అగ్ని ప్రమాదం జరిగితే భారీగా ఆస్తి, ప్రాణ నష్టం ముప్పు పొంచి ఉంది.

● నగరపాలక సంస్థలో ప్రధానంగా ఇద్దరు అసిస్టెంట్ సిటీప్లానర్‌లు, బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్లు ఉన్నారు.. వీరి పర్యవేక్షణలో ఆయా డివిజన్ పరిధిలో వార్డు ప్లానింగు, రెగ్యులరేషన్ సెక్రటరీలు 50 మంది వున్నారు. తగినంత సిబ్బంది వున్నా భవన నిర్మాణాలను పర్యవేక్షించే నాథుడే కరువయ్యారు.. నగర పాలక సంస్థ పరిధిలో 70కిపైగా అక్రమ నిర్మాణాలు వున్నట్టు సమాచారం.. వర్షంనీరు వృథా కాకుండా ఆయా భవనాల వద్ద ఇంకుడు గుంతల నిర్మాణాలు చేపట్టాలి.. ఎక్కడా (మిగతా 8వ పేజీలో...)

నోటీసులు జారీ చేశాం

అక్రమ భవన నిర్మాణాలపై యాజమానులను గుర్తించి నోటీసులు జారీ చేశాం. ఎక్కడ వున్నాయో? క్షేత్రస్థాయిలో పరిశీలించి వివరాలు సేకరిస్తున్నాం. ప్లానింగు లేకుండా అక్రమ కట్టడం చేపడ్తే ఉపేక్షించేది లేదు. అక్రమ కట్టడాల విషయంలో ఉక్కుపాదం మోపుతాం.. అటువంటి వారికి అపరాధ రుసుం విధిస్తాం.

- పి.నల్లనయ్య, కమిషనర్, విజయనగరం కార్పొరేషన్

కొబ్బరి నీళ్లు తాగేద్దాం!

కొబ్బరి నీళ్లు ఆరోగ్యానికి మంచివని అందరికీ తెలుసు. వేసవికాలంలోనే కాదు చలికాలంలో కూడా తాగవచ్చు. కొబ్బరినీళ్లు తాగడం వల్ల శరీరానికి ఎన్నో పోషకాలు, ఖనిజాలు, మినరల్స్ అందుతాయి. చలికాలంలో కొబ్బరి నీళ్లు అందించే ఆరోగ్య ప్రయోజనాల గురించి తెలుసుకుందాం.



చర్మానికి : చలికాలంలో కొబ్బరినీళ్లు తరచూ తాగడం వల్ల శరీరంలో తేమ శాతం పెరుగుతుంది. దీనివల్ల చర్మం పొడారిపోకుండా మృదువుగా ఉంటుంది. ముఖంపై పగుళ్లు, మొటిమలు రాకుండా ఉంటాయి. రాత్రి పడుకునేముందు ముఖాన్ని కొబ్బరి నీళ్లతో కడిగితే మచ్చలు మాయమై చర్మం కాంతివంతంగా మారుతుంది.

రోగనిరోధక శక్తి: కొబ్బరి నీళ్లలో రెబోఫ్లేవిన్, నియాసిన్, థయామిన్, పిరిడాక్సిన్ విటమిన్లతోపాటు యాంటీ వైరల్, యాంటీ బ్యాక్టీరియల్ గుణాలు అధికంగా ఉంటాయి. ఇవి శరీరానికి తక్షణ శక్తితోపాటు ఉత్సాహాన్ని, చురుకుదనాన్ని అందిస్తాయి. చలికాలంలో తరచూ వేధించే అనేక అనారోగ్య సమస్యలను తట్టుకునేందుకు అవసరమైన రోగనిరోధక శక్తిని పెంచుతాయి. కొబ్బరినీళ్లలో ఉండే సహజ చక్కెరలు, ఎలక్ట్రోలైట్లు శరీరాన్ని ఉత్తేజితం చేసి చలికాలంలో వచ్చే బద్ధకాన్ని పోగొడతాయి.

బరువు : కొబ్బరి నీళ్లలో కొవ్వు శాతం చాలా తక్కువగా ఉంటుంది. పీచు పదార్థాలు, పిండి పదార్థాలు ఎక్కువగా ఉంటాయి. అందుకే కొబ్బరి నీళ్లు తాగిన వెంటనే చాలా సమయం వరకు కడుపు నిండిన భావన ఉంటుంది. దీనివల్ల త్వరగా ఆహారం తీసుకోవాలని అనిపించదు. క్రమంగా శరీర బరువు నియంత్రణలోకి వస్తుంది. బరువు తగ్గాలనుకునేవారు ప్రతిరోజూ కొబ్బరినీళ్లు తాగితే మంచి ఫలితం కనిపిస్తుంది.

జీర్ణక్రియ : కొబ్బరినీళ్లు తాగడం వల్ల కడుపులో ప్రేగు కదలికలు సక్రమంగా ఉంటాయి. జీర్ణక్రియ సులభంగా జరుగుతుంది. మలబద్ధకం సమస్య రాదు. కొబ్బరి నీళ్లలోని ఆల్కలీన్ గుణాలు పొట్టలో పీహెచ్ స్థాయిని తటస్థం చేస్తాయి. దీనివల్ల కడుపులో మంట, అజీర్ణం వంటి సమస్యలు రావు. కాలేయం ఆరోగ్యంగా ఉంటుంది. కొబ్బరి నీళ్లలో ఉండే పొటాషియం శరీరంలోని అదనపు నీటిని, ఇతర వ్యర్థ పదార్థాలను బయటికి పంపుతుంది. రక్తపోటుని నియంత్రిస్తుంది. మూత్రపిండాల్లో రాళ్లు ఏర్పకుండా కాపాడుతుంది.

గుండె : తరచూ కొబ్బరి నీళ్లు తాగడం వల్ల రక్త ప్రసరణ వ్యవస్థ అదుపులో ఉంటుంది. రక్తంలో చెడు కొలెస్ట్రాల్, ట్రైగ్లిజరైడ్ స్థాయులు తగ్గుతాయి. దీనివల్ల గుండె సంబంధిత సమస్యలు రాకుండా ఉంటాయి. కొబ్బరి నీళ్లలో ఉండే మెగ్నీషియం శరీరంలో ఇన్సులిన్ పనితీరుని మెరుగుపరుస్తుంది. దీనివల్ల రక్తంలో చక్కెర స్థాయి నియంత్రణలో ఉంటుంది.

శక్తి : చలికాలంలో వ్యాయామం చేసిన తరవాత లేదంటే ఆటలు ఆడిన తరవాత శరీరానికి నిస్సత్తువ ఆవరిస్తుంది. ఇటువంటి సమయంలో వెంటనే కొబ్బరి నీళ్లు తాగితే శారీరక శ్రమ నుంచి ఉపశమనం లభిస్తుంది. కొబ్బరి నీళ్లలో ఉండే ఎలక్ట్రోలైట్లు, ఖనిజ లవణాలు తక్షణ శక్తిని అందిస్తాయి.

సి విటమిన్ లోపిస్తే...

విటమిన్ 'సి' మన ఆరోగ్యానికి అత్యవసరమైన పోషకం. రోగనిరోధక శక్తిని పెంచడంలో దీని పాత్ర కీలకం. గుండె, చర్మం, ఎముకలు, కండరాలు, దంతాలను ఆరోగ్యంగా ఉంచుతుంది. మన శరీరంలో విటమిన్ 'సి' లోపిస్తే వచ్చే అనారోగ్య సమస్యల గురించి తెలుసుకుందాం.



రక్తహీనత : మనం తీసుకునే ఆహారపదార్థాల నుంచి ముఖ్యంగా శాకాహారం నుంచి ఐరన్‌ను గ్రహించడంలో శరీరానికి సి విటమిన్ సహాయం తప్పనిసరి. విటమిన్ సి తగిన పరిమాణంలో లేని పక్షంలో శరీరానికి ఐరన్ అందక రక్తం ఉత్పత్తి కాదు. దీంతో రక్తహీనత సమస్య వస్తుంది. శాకాహారుల్లో ఈ సమస్య అధికంగా ఉంటుంది.

అంటువ్యాధులు : సి విటమిన్ లోపించడం వల్ల రోగనిరోధక శక్తి తగ్గుతుంది. ఫలితంగా పలు రకాల అంటువ్యాధులు వచ్చే ప్రమాదం ఉంటుంది. జలుబు, దగ్గు, జ్వరం, న్యుమోనియా వంటివి తరచూ వేధిస్తుంటాయి.

ఎముకలు విరగడం : ఎముకలు బలంగా ఉండేందుకు కావాల్సిన కాల్షియాన్ని శరీరం సంగ్రహించేందుకు సి విటమిన్ తోడ్పడుతుంది. దీని లోపం వల్ల శరీరం కాల్షియాన్ని శోషించుకోలేదు. ఫలితంగా ఎముకలు బలహీనమై ఆస్టియోపోరోసిస్ అనే వ్యాధి వస్తుంది. చిన్నపాటి ప్రమాద సంఘటనలకే ఎముకలు విరిగిపోతుంటాయి. గోళ్లు పెళుసుగా మారతాయి.

కండరాలు బలహీనం : సి విటమిన్ లోపిస్తే శరీరంలో 'కొల్లాజెన్' అనే ప్రోటీన్ ఉత్పత్తి కాదు. దీంతో కండరాలు, ఎముకల మధ్య అనుసంధానం దెబ్బతింటుంది. రక్తనాళాల గోడలు బలహీనమై కండరాల్లో వాపుని నొప్పిని కలిగిస్తాయి. గాయాలు తొందరగా నయం కావు.

దృష్టి దోషాలు : శరీరానికి సి విటమిన్ అందకపోతే తొందరగా వార్ధక్య లక్షణాలు ఎదురవుతాయి. కంటిచూపును అందించే రెటీనాలో ప్రధాన భాగమైన మాక్యులాలో అసాధారణ స్రావాలు విడుదలవుతాయి. దీంతో మాక్యులా పొరలు ఉబ్బి కంటి చూపు మందగిస్తుంది. రంగులను గుర్తించడం కష్టమవుతుంది.

అలసట: సి విటమిన్ లోపం కారణంగా శరీరంలో శక్తి ఉత్పత్తి వ్యవస్థ దెబ్బతింటుంది. దీంతో శరీరానికి కావాల్సిన శక్తి లభించక ఎప్పుడూ నీరసంగా, బలహీనంగా అనిపిస్తుంది. ఎంత బలమైన ఆహారం తీసుకున్నప్పటికీ అలసటగా, మత్తుగా అనిపిస్తుంది. ఏకాగ్రత కుదరక మానసిక సమస్యలు ఏర్పడతాయి.

నోటి సమస్యలు: విటమిన్ సి లోపం వల్ల దంతాలు, చిగుళ్లు బలహీనమవుతాయి. డెంటిన్ అనే పదార్థం ఏర్పడక పోవడంతో దంతాల్లోని రక్తనాళాలు పెళుసుగా మారతాయి. పళ్లు తోముతున్నపుడు కలిగే చిన్నపాటి ఒత్తిడికే రక్తనాళాలు చిట్లి చిగుళ్ల నుంచి రక్తం స్రవిస్తుంది. చిగుళ్లలో వాపు, నొప్పి కూడా బాధిస్తుంటాయి.

సినీ కుటుంబ నేపథ్యం. కానీ పరిశ్రమ వైపు వెళ్లలేదు. సంగీత సాగరంలో తనకంటూ కొన్ని తీపి గుర్తులు ఉండాలనే తాపత్రయం. అందుకే మూడు దశాబ్దాలుగా స్వర సంగమంలో మునిగిపోయారు.

వేదికలెక్కి... వేల ప్రదర్శనలు ఇచ్చి... ప్రతిష్ఠాత్మక 'ఉస్తాద్ బిస్మిల్లాఖాన్ యువ పురస్కారం' అందుకున్నారు. అలనాటి ప్రముఖ నటుడు 'రక్తకన్నీరు' నాగభూషణం మనవరాలు... కర్ణాటక సంగీత కళాకారిణి... శ్వేతా ప్రసాద్‌తో 'నవ్య' ముచ్చట్లు.



సుస్వర సంగీత ఝరి

"ఒకరి పేరు చెప్పుకొని కాదు... మనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు ఉండాలనేది నా అభిమతం. అందుకు నేను ఎంచుకున్న మార్గం సంగీతం. మూడేళ్లప్పుడు మొదలుపెట్టాను. మూడు దశాబ్దాలుగా పాడుతూనే ఉన్నాను. సరిగమల ప్రవాహంలో సాగిపోతున్నాను. దానికి ప్రతిఫలమే ఇటీవల నేను అందుకున్న 'ఉస్తాద్ బిస్మిల్లాఖాన్ యువ పురస్కారం'. నాకు 2022 సంవత్సరానికి గానూ కర్ణాటక సంగీతంలో వచ్చింది. ఢిల్లీలో 'కేంద్ర సంగీత నాటక అకాడమీ' ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఈ అవార్డులను ప్రదానం చేశారు. యువ కళాకారులకు ఇది 'పద్మశ్రీ'తో సమానం. స్వయంకృషితో ఎదిగి, ఇంతటి ప్రతిష్ఠాత్మక పురస్కారం తీసుకోవడం సంతోషంగా ఉంది. ఎంతో గర్వంగా అనిపిస్తోంది.

సంగీత జ్ఞానం ఉన్నవారే...

సంగీతాభిరుచి నాకు మా నాయనమ్మ శశిరేఖ నుంచి వచ్చింది. ఆవిడ కర్ణాటక సంగీతం చాలా బాగా ఆలపిస్తారు. మా తాత నాగభూషణం గారి 'రక్తకన్నీరు' నాటకానికి చాలా ఏళ్లు నాయనమ్మే పాడేవారట. నాన్న రవీంద్రనాథ్‌ది మేనరికం. మా అమ్మ ప్రసన్నకు మేనత్తే మా నాయనమ్మ. అమ్మ వైపు అందరికీ సంగీతంలో ప్రవేశం ఉంది. ఒకరు వయొలిన్ వాయించేవాళ్లు, ఒకరు హార్మోనియం... మరొకరు గాత్రం. కాకపోతే ఎవరూ ఎక్కడా నేర్చుకోలేదు. అలా నాకూ నాయనమ్మ వారసత్వం వచ్చింది. నేను పుట్టి పెరిగింది హైదరాబాద్‌లోనే. సంగీతంలో రామలక్ష్మి రంగాచారి గారు నా తొలి గురువు. ఐదారేళ్ల తరువాత నేతి శ్రీరామ్ గారి వద్ద శిష్యరికం చేశాను. మొత్తం పదహారేళ్లపాటు సంగీతం నేర్చుకున్నాను. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో బీకాం తరువాత ఎంఏ మ్యూజిక్ చదివాను. ప్రస్తుతం కర్ణాటక సంగీతంలో ఎంఫిల్ చేస్తున్నాను.

పిలిచి పాడించేవారు...

పదో ఏట నుంచే కూచిపూడి, భరతనాట్యం ప్రదర్శనలకు పాడేదాన్ని. మా తాతగారిని కలవడానికి పెద్ద పెద్ద నటులు, నాయకులు ఇంటికి వచ్చేవారు. నన్ను పిలిచి... 'ఇది నా మనవరాలు. బ్రహ్మాండంగా పాడుతుంది... వినండి' అని నాతో వాళ్ల ముందు పాడించేవారు. ఎక్కువగా కమ్యూనిస్టు పాటలు పాడమనేవారు. నాయనమ్మకు పక్షవాతం వచ్చి పన్నెండేళ్లు మంచం మీదే ఉన్నారు. అప్పట్లో తను సొంతంగా రాసుకున్న గీతాలు నేను పాడి వినిస్తుంటే ఎంతో ఉద్వేగానికి లోనయ్యేవారు. తాత కూడా కన్నీళ్లు పెట్టుకొనేవారు.

ఆ ఇద్దరూ భలే ఇష్టం...

తాత గారికి ఐదుగురు సంతానం. ముగ్గురు అబ్బాయిలు, ఇద్దరు అమ్మాయిలు. ఇక మా ఇంట్లో నేనే పెద్దదాన్ని. తమ్ముడు కౌశిక్ హోటల్ మేనేజ్‌మెంట్ చదివి, అదే రంగంలో స్థిరపడ్డాడు. చిన్నప్పుడు తాతయ్య మాతో చాలా సరదాగా గడిపేవారు. మా మధ్య చాలా సంభాషణలు జరిగేవి. 'రోజూ మేకప్ వేసుకొని తీయాలంటే చికాగ్గా ఉండదా' అని అడిగితే... 'అవునే..! మేకప్ కోసం తెల్లవారుజాము మూడింటికి లేచేవాడిని. మంచం మీద పడుకొంటే ముఖానికి రంగు వేసేసేవాళ్లు' అనేవారు నవ్వుతూ. నచ్చిన నటులు ఎవరని అడిగేవాళ్లం. ఆయన ఎప్పుడూ జయప్రద గారి గురించి గొప్పగా చెప్పేవారు. 'ఏంటోనే... ఆ అమ్మాయిని చూస్తుంటే అమ్మవారిలా అనిపిస్తుంది. ఏం అందం ఆ అమ్మాయిది' అనేవారు. ఆవిడ కూడా తాతయ్యను ఆప్యాయంగా 'డాడీ' అని పిలిచేవారు. అలాగే సూర్యకాంతం గారి వ్యక్తిత్వం ఆయనకు బాగా నచ్చేది. ఇద్దరూ 'ఒరేయ్ అన్నయ్యా' అంటే 'ఒరేయ్ అన్నయ్యా' అని పిలుచుకొనేవారట. ఆవిడ మహా సరదా మనిషట. షూటింగ్‌లో కాస్త ఖాళీ దొరికితే చాలు... 'ఒరేయ్ అన్నయ్యా... రా ఆడుకొందాం' అని ఎడం చేత్తో పేక ముక్కలు అలా వేసిపడేసేవారట. ఫ్రీగా ఆడమంటే అస్సలు ఒప్పుకొనేవారు కాదుట. డబ్బులకు తప్ప ఆడేవారు కాదుట. ఇంట్లో అందరికీ వండి పెట్టడమంటే సూర్యకాంతం గారికి మహా ఇష్టమని చెప్పేవారు తాతయ్య.

ఎందుకో ఒప్పుకోలేదు...

నేను ఎనిమిదో తరగతిలో ఉండగా మా తాత చనిపోయారు. ఎందుకో తెలియదు... ఆయన తన పిల్లలు ఎవర్నీ సినిమాల్లోకి రానీయలేదు. నేను పుట్టేనాటికి... అంటే 1983కు ముందే పరిశ్రమతో సంబంధాలు తెంచుకుని హైదరాబాద్‌కు వచ్చేశారు. మా నాన్న కోసం దాసరి నారాయణరావు తదితరులు బోలెడన్ని కథలు రాసుకున్నారు. 'రవిబాబు కోసం నేను ఈ కథ రాసుకున్నా. బాబును నాకు వదిలెయ్... ఐదేళ్లలో సూపర్‌స్టార్‌ను చేస్తా' అనేవారు దాసరి. నాన్నది మంచి పర్సనాలిటీ. చూడ్డానికి చాలా బాగుంటారు. అయితే తాత గారు ససేమిరా అన్నారు. 'ఏమైనా చెప్పండి. అటువైపు నా పిల్లలను పంపించను' అని తెగేసి చెప్పేవారట. నేను కూడా కీరవాణి, కోటి, మణిశర్మ గార్ల సినిమాలకు పదేళ్లపాటు కోరస్ పాడాను. అదికూడా తాతకు నచ్చేది కాదు. 'ఎందుకు పంపిస్తున్నావురా పిల్లని' అని నాన్నపై కోప్పడేవారు. నలభై ఏళ్లకు పైగా పరిశ్రమలో ఉన్న ఆయన అంత కచ్చితంగా చెబుతున్నారంటే ఆలోచించాలి కదా!

వేల ప్రదర్శనలు...

ప్రస్తుతం నాకు, మావారు రేణుకా ప్రసాద్‌కు సంగీతమే వృత్తి. ఇదే మా జీవితం. ఆయన మృదంగం వాయిస్తారు. నట్టువాంగం చేస్తారు. మాకు ఒకతే అమ్మాయి... ప్రసిద్ధ. ఇంటర్ ఫస్ట్ ఇయర్ చదువుతోంది. వయొలిన్ బ్రహ్మాండంగా వాయిస్తుంది. నేను, మావారు ఇప్పటికి మూడు వేల ప్రదర్శనల వరకు ఇచ్చివుంటాం. ఏటా అమెరికా వెళతాం. కచేరీలు, గెస్ట్ లెక్చరర్స్ ఇస్తాం. సంగీత తరగతులు, వర్క్‌షాప్‌లు నిర్వహిస్తున్నాం. శోభానాయుడు గారికి పాతికేళ్లు పాడాను. ఆనంద్ శంకర్, స్వప్నసుందరి తదితర ప్రముఖ నాట్యకారులందరికీ నేనే పాడుతున్నాను. ఇవికాకుండా ఎన్నో కచేరీలు చేశాను. తమన్ గారు అడిగితే 'సర్కారువారి పాట' చిత్రంలోని 'కళావతి' పాటలో జతులు ఆలపించాను. నాని 'అంటే సుందరానికి' చిత్రం 'పంచె కట్టు' పాట తమిళం, మళయాళం వెర్షన్లు పాడాను. ఇంతకుమించి సినిమా పాటలు పాడలేదు.

పెద్దగా కోరికలు లేవు...

కొవిడ్ సమయంలో సంపాదన లేక కొన్ని రోజులు ఇబ్బంది పడినా... అమ్మవారి దయవల్ల మా జీవితం ఇప్పుడు సంతోషంగా సాగిపోతోంది. మాది పదహారు మంది ఉన్న ఉమ్మడి కుటుంబం. కోట్లు సంపాదించాలి... బెంజిలో తిరగాలనే కోరికలేవీ మాకు లేవు. ముప్పై ఏళ్లుగా పాడుతున్నాం. వచ్చిన డబ్బుతో ఇల్లు కొనుక్కున్నాం. కారు ఉంది. ఇబ్బందులు లేకుండా సంసారం సాగిపోవడానికి సరిపడా సంపాదన వస్తోంది. ఒక మనిషి ఆనందంగా జీవించడానికి ఇంతకంటే ఏంకావాలి! చుట్టూ మన అనుకొనే మనుషులు... నాలుగు కచేరీలు ఉంటే చాలు మాకు."

• హనుమా



అమ్మవల్లే ఇక్కడివరకు...

"సంగీతంలో నేను ఈ స్థాయికి రావడానికి మా అమ్మే కారణం. చిన్నప్పుడు సంగీత తరగతులకు వెళ్లనని ఏడ్చేదాన్ని. అయినా అమ్మ వినేది కాదు. 'నీకు భగవంతుడు మంచి గొంతు ఇచ్చాడు. నువ్వు ఏమైనా చెయ్యి. క్లాస్‌కు వెళ్లాల్సిందే' అనేది. ఎక్కడ పోటీలున్నా వెంటబెట్టుకుని తీసుకువెళ్లేది. నేను సంగీతం నేర్చుకోవడానికి ఏంకావాలన్నా చేసేది. పెళ్లయ్యాక మావారు, అత్తగారు కూడా అంతే ప్రోత్సహించారు. అమ్మ ప్రేరణ, అత్తింటివారి సహకారంవల్లే ఇదంతా సాధ్యమైంది."

తాతగారి కోసం రాస్తే...

'ముత్యాలముగ్గు'లో రావుగోపాలరావు గారు పోషించిన పాత్రను వాస్తవానికి బాపూ గారు తాతయ్య కోసం రాసుకున్నారు. ఎంత అడిగినా 'నేను చేయాలనుకోవడంలేదు' అని తాత చెప్పేశారు. సినిమాలు వదిలేసినప్పుడు చెన్నైలో ఆస్తులన్నీ అమ్మేసుకుని ఇక్కడ చిన్న ఇల్లు కొనుక్కుని స్థిరపడ్డారు. ఆ నిర్ణయం ఎందుకు తీసుకున్నారో ఇప్పటికీ ఆయన పిల్లలు ఎవరికీ తెలియదు. ప్రస్తుతం మాకు పరిశ్రమలో ఎవరితో సంబంధాలు లేవు. అయితే జూనియర్ ఎన్టీఆర్ నాకు కజిన్ అవుతాడు. వాళ్లమ్మ శాలిని గారు, మా అమ్మ కజిన్ సిస్టర్స్. చిన్నప్పుడు తారక్ కూచిపూడి నాట్యానికి నేను గాత్ర సహకారం అందించేదాన్ని. ఇప్పుడు అతను బాగా బిజీ అయిపోయాడు. వాళ్లమ్మకు, మా అమ్మకు ఇప్పటికీ ఎంతో సాన్నిహిత్యం ఉంది. అలాగే బాలు గారితో మా నాన్నకు మంచి స్నేహం. ఇద్దరూ చెన్నైలో పక్క ఇళ్లల్లో ఉండేవారు.



కాలేయాన్ని కాపాడుకుందాం!

కాలేయం మన శరీరంలో అత్యంత ముఖ్యమైన అవయవం. శరీరంలో చేరిన విష పదార్థాలను, ఇతర వ్యర్థాలను తొలగించడంలో ప్రధాన పాత్ర పోషిస్తుంది. ఏదైనా సమస్య వచ్చినపుడు కాలేయం తనంతట తాను మరమ్మతు చేసుకుంటుంది. మనం తీసుకునే కొన్ని ఆహార పదార్థాలు కూడా ఇందుకు సహకరిస్తాయి. వాటి గురించి తెలుసుకుందాం.

వెల్లుల్లి

- ఇందులో సల్ఫర్‌తోపాటు అల్లిసిన్, సెలీనియం లాంటి రసాయన సమ్మేళనాలు ఉంటాయి. శరీరంలోని వ్యర్థాలను బయటికి పంపేందుకు కాలేయంలో ఉత్పత్తయ్యే ఎంజైముల తయారీకి ఇవి తోడ్పడతాయి. వెల్లుల్లిని ఆహార పదార్థాల్లో చేర్చుకోవడం ద్వారా కాలేయం పనితీరు మెరుగుపడుతుంది.

బీట్‌రూట్

- తరచూ బీట్‌రూట్ రసం తీసుకోవడం వల్ల అందులోని బీటాలైన్ సమ్మేళనాలు కాలేయంలోని ఇన్‌ఫ్లమేషన్‌ను తగ్గిస్తాయి. బీట్‌రూట్‌లో ఉండే పలు నైట్రేట్‌లు కాలేయంలో వ్యర్థాలు పేరుకోకుండా చేస్తాయి.

గ్రీన్ టీ

- తరచూ గ్రీన్ టీ తాగడం వల్ల కాలేయంలో ఎంజైమ్‌ల ఉత్పత్తి నియంత్రణలో ఉంటుంది. గ్రీన్ టీలోని యాంటీ ఆక్సిడెంట్లు కాలేయంలోని వ్యర్థాలను కరిగించి మూత్రం ద్వారా బయటికి వెళ్లేలా చేస్తాయి.

ఆకు కూరలు


- ఆకు కూరల్లో క్లోరోఫిల్ అధికంగా ఉంటుంది. ఇది రక్తంలో చేరిన భార ఖనిజాలు, పురుగు మందుల అవశేషాలు, ఇతర రసాయనాలను తొలగించడంలో కాలేయానికి సహాయం చేస్తుంది. ఆకుకూరలు, ముదురు ఆకుపచ్చ రంగులో ఉండే కూరగాయలను తరచూ తినడం వల్ల కాలేయంపై పని భారం తగ్గుతుంది.

ఆలివ్ ఆయిల్

- దీనిలో ఆరోగ్యకరమైన కొవ్వు పదార్థాలు ఉంటాయి. ఇవి శరీరంలో చేరిన కొన్ని రకాల విష పదార్థాలను శోషించుకుంటాయి. ప్రతిరోజూ తినే ఆహార పదార్థాల్లో ఆలివ్ ఆయిల్‌ను చేర్చుకోవడం వల్ల కాలేయంపై పని ఒత్తిడి తగ్గుతుంది.

ధనియాలు

- ఒక గ్లాసు నీటిలో ఒక చెంచా ధనియాలు వేసి రాత్రంతా నానబెట్టి ఉదయాన్నే పరగడుపున తాగితే కాలేయంలో వ్యర్థాలు మిగలకుండా ఉంటాయి.



ధనియాల్లో ఉండే పీచు పదార్థాలు, ఫోలిక్ యాసిడ్‌లు ప్రభావవంతంగా పనిచేసి కాలేయాన్ని శుభ్రపరుస్తాయి.

వాల్‌నట్స్

- వీటిలో ఒమేగా 6, ఒమేగా 3 ఫాటీ యాసిడ్లు అధికంగా ఉంటాయి. ఇవి కాలేయంలో కొవ్వులు పేరుకోకుండా చేస్తాయి. వాల్‌నట్స్ తినడం వల్ల వాటిలోని అర్జినైన్ అనే అమైనో ఆమ్లం శరీరం నుంచి అమ్మోనియాను తొలగించడంలో కాలేయానికి సహకరిస్తుంది.

బాదం

- బాదం పప్పులో ఇ విటమిన్ ఉంటుంది. ఇది కాలేయంలోని ఆక్సీకరణ ఒత్తిడితో పోరాడుతుంది. కాలేయం ఆరోగ్యంగా ఉండాలంటే ప్రతిరోజూ కనీసం అయిదు బాదం పప్పులను నీటిలో నానబెట్టి తినాలి.

పండ్లు

- నిమ్మ, నారింజ, బత్తాయి లాంటి సిట్రస్ పండ్లను తరచూ తినడం వల్ల శరీరానికి పుష్కలంగా సి విటమిన్ అందుతుంది. ఇది శరీరంలో చేరిన వ్యర్థాలను పూర్తిగా తొలగించి కాలేయానికి విశ్రాంతిని ఇస్తుంది. యాపిల్ పండ్లను తినడం వల్ల వాటిలో ఉండే పెక్టిన్ అనే పీచు పదార్థం కాలేయాన్ని పూర్తిగా శుభ్రం చేస్తుంది. నల్ల ద్రాక్షను జ్యూస్‌లా చేసుకుని తాగితే అందులోని యాంటీ ఆక్సిడెంట్లు కాలేయంలో ఇన్‌ఫ్లమేషన్‌ని తగ్గిస్తాయి.


ఈ సినిమా ఆ లోటు తీరుస్తుంది

- మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు



అమర గాయకుడు ఘంటసాల వెంకటేశ్వరరావు జీవితం ఆధారంగా తెరకెక్కుతోన్న చిత్రం 'ఘంటసాల ది గ్రేట్'. కృష్ణ చైతన్య టైటిల్ రోల్ పోషిస్తున్నారు. సిహెచ్. రామారావు దర్శకత్వంలో సిహెచ్.ఫణి నిర్మించారు. తాజాగా, ఈ సినిమా రిలీజ్ డేట్ పోస్టర్‌ను మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు ఆవిష్కరించారు. వచ్చే ఏడాది ఫిబ్రవరి 14న ఈ చిత్రం విడుదల కానుంది. ఈ సందర్భంగా వెంకయ్యనాయుడు మాట్లాడుతూ "ఈతరం ఘంటసాల గురించి తెలుసుకోవాల్సిన అవసరం ఎంతో ఉంది. అందరూ ఆయన్ని శతాబ్ది గాయకుడు అంటారు. నేను ఆయన్ని అమర గాయకుడు అంటాను. సంగీతం ఉన్నంత కాలం ఆయన ప్రజల మనసుల్లో ఉంటారు. కృషితో నాస్తి దుర్భిక్షం, వినయంతో విద్య ప్రకాశిస్తుందని చెప్పడానికి నిలువెత్తు నిదర్శనం ఆయన. దేశంలో ఇప్పటివరకూ ఏ గాయకుడి మీద పూర్తి స్థాయి సినిమా రాలేదు. ఈ సినిమా ఆ లోటును తీరుస్తుంది" అని అన్నారు.

మార్చిలో మొదలు



మేర్లపాక గాంధీ దర్శకత్వంలో వరుణ్‌తేజ్ కథానాయకుడిగా ఓ చిత్రాన్ని ప్రకటించిన విషయం తెలిసిందే. యువీ క్రియేషన్స్, ఫస్ట్‌ఫ్రేమ్ ఎంటర్‌టైన్‌మెంట్స్ భారీస్థాయిలో నిర్మిస్తున్నాయి. ఈ సినిమా షూటింగ్‌పై ఆదివారం మేకర్స్ నుంచి అప్డేట్ వచ్చింది. 'మేర్లపాక గాంధీ అద్భుతమైన స్క్రిప్ట్‌ను సిద్ధం చేశారు, వరుణ్ తేజ్ పాత్ర సరికొత్తగా ఉండబోతోంది. ప్రేక్షకులను ఆకట్టుకునే అన్ని అంశాలతో ఈ చిత్రం రూపుదిద్దుకుంటోంది. ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ జరుగుతోంది, వచ్చే ఏడాది మార్చిలో చిత్రీకరణ ప్రారంభిస్తామ'ని తెలిపారు.

తుదిదశలో చిత్రీకరణ



ప్రభాస్ కథానాయకుడిగా మారుతి రూపొందిస్తున్న హారర్ థ్రిల్లర్ 'రాజా సాబ్'. ప్రస్తుతం చిత్రీకరణ జరుగుతోంది. మాళవికా మోహనన్ కథానాయికగా నటిస్తున్నారు. ఓ ఇంటర్వ్యూలో మాళవిక 'రాజాసాబ్' షూటింగ్ గురించి ఆసక్తికర అంశాలను పంచుకున్నారు. "రాజాసాబ్' షూటింగ్ తుది దశకు చేరుకుంది. మంచి ప్లానింగ్‌తో మారుతి షూటింగ్ కొనసాగిస్తున్నారు. ఆయన త్వరలోనే ఆశ్చర్యపోయే అప్‌డేట్ ఇవ్వబోతున్నారు' అన్నారు. వచ్చే ఏడాది ఏప్రిల్ 10న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. టీజీ విశ్వ ప్రసాద్, వివేక్ కూచిబొట్ల నిర్మిస్తున్న ఈ చిత్రానికి తమన్ సంగీతం అందిస్తున్నారు.

అద్భుత ప్రయాణం ముగిసింది



మలయాళ కథానాయకుడు మోహన్‌లాల్, పృథ్వీరాజ్ సుకుమారన్ దర్శకత్వంలో నటిస్తున్న చిత్రం 'లూసిఫర్ 2: ఎంపురన్'. 2019లో విడుదలై ఘనవిజయం సాధించిన 'లూసిఫర్' సినిమాకు ఇది కొనసాగింపు. లైకా ప్రొడక్షన్స్ నిర్మిస్తోంది. తాజాగా, ఈ సినిమా షూట్ పూర్తైనట్లు మోహన్‌లాల్ ఇన్‌స్టాగ్రామ్ ద్వారా తెలిపారు. "లూసిఫర్ సినిమా షూట్ పూర్తైంది. 14 నెలలుగా ఎనిమిది రాష్ట్రాలు.. యూఎస్ఏ.. యూకే.. యూఏఈలోని అద్భుతమైన లోకేషన్లలో చిత్రీకరించాం. అద్భుత ప్రయాణమిది. ప్రతి ఫ్రేమ్‌ని తన సృజనాత్మకతతో మరో స్థాయికి తీసుకెళ్ళే అపార ప్రతిభ పృథ్వీరాజ్ సొంతం. తన కలం పదునుతో సినిమాకు ఎంతో ప్రత్యేకతను తెచ్చిన మురళీ గోపికి.. ఈ ప్రాజెక్ట్‌పై ఎంతో నమ్మకం పెట్టిన నిర్మాతలకు ధన్యవాదాలు. టీమ్ సమష్టి కృషి వల్లే ఈ సినిమా సాధ్యమైంది. నా సినీ ప్రయాణంలో ఈ సినిమా ఓ మైలురాయి. అభిమానులు అందించే ప్రేమే మాలో స్ఫూర్తిని పెంచింది" అని పేర్కొన్నారు. వచ్చే ఏడాది మార్చి 27న ఈ సినిమా విడుదలవుతోంది.


ఎక్స్ ఖాతా డిలీట్



నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమ్ అవుతోన్న 'నయనతార: బియాండ్ ద ఫేరీ టేల్' డాక్యుమెంటరీ విషయంలో ధనుష్, నయనతార మధ్య మొదలైన వివాదం తెలిసిందే. 'నానుమ్ రౌడీ దాన్' సినిమాలోని కొన్ని సెకన్ల ఫుటేజీని వాడారని.. అందుకోసం ధనుష్.. నయనతార, విఘ్నేష్ శివన్ కోర్టు నోటీసులు పంపారు. అయితే, ఇటీవలే 'నానుమ్ రౌడీ దాన్' సినిమాలోని క్లిప్ ఉచితంగా చూసేయ్యండి అనే వీడియోతో పాటు ధనుష్ ఓ మీడియా ఈవెంట్‌లో మాట్లాడిన వీడియోనూ ఇన్‌స్టా స్టోరీలో పోస్ట్ చేశారు విఘ్నేశ్. ధనుష్ అభిమానుల నుంచి ట్రోలింగ్ జరిగేసరికి ధనుష్ వీడియోను తొలగించారు. తాజాగా, తాను అజిత్ నటించిన 'ఎన్నై అరిందాల్' (ఎంతవాడు కానీ) సినిమా కోసం ఓ పాట రాశాననీ.. అదే టైమ్‌లో తన మొదటి మూవీ 'నానుమ్ రౌడీ దాన్'ని చూసి ఆయన మెచ్చుకున్నారని తెలిపారు. ఇవన్నీ అబద్ధాలంటూ.. అజిత్ సినిమా రిలీజైన ఏడు నెలలకు 'నానుమ్ రౌడీ దాన్' విడుదలైందని.. అసలు థియేటర్లలోకి సినిమా రాకముందే అజిత్ ఎలా చూశారని ధనుష్ అభిమానులు విఘ్నేష్‌ను ట్రోల్ చేశారు. దీంతో విఘ్నేష్ శివన్ తన ఎక్స్ ఖాతాను డిలీట్ చేశారు.

నవ్య | చిత్రజ్యోతి

మహేశ్‌బాబు ఎంజాయ్ చేశారు



2019లో వచ్చిన 'ది లయన్ కింగ్' చిత్రానికి కొనసాగింపుగా వస్తున్న చిత్రం 'ముఫాసా: ది లయన్ కింగ్'. బారీ జెన్‌కిన్స్ దర్శకత్వం వహించారు. వాల్ట్ డిస్నీ పిక్చర్స్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 20న విడుదలవుతోంది. ఈ చిత్రం తెలుగు వెర్షన్‌లో ముఫాసా పాత్రకు హీరో మహేశ్‌బాబు డబ్బింగ్ చెప్పారు. ఆదివారం చిత్రబృందం నిర్వహించిన ప్రచార కార్యక్రమంలో ముఫాసా, మహేశ్‌బాబు ప్రచార చిత్రాన్ని నమ్రతా శిరోద్కర్ ఘట్టమనేని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 'డిస్నీ సంస్థ ప్రతిష్ఠాత్మకంగా నిర్మించిన చిత్రమిది. ఇలాంటి మంచి సినిమాను ఔచిత్యం చెడకుండా డబ్ చేయడం ఓ సవాల్ అనే చెప్పాలి. డిస్నీ సంస్థ చాలా శ్రమించి ఈ చిత్రాన్ని తెలుగు ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తోంది. చాలా ఎంజాయ్ చేస్తూ 'ముఫాసా' పాత్రకు మహేశ్‌బాబు డబ్బింగ్ చెప్పారు. ఈ చిత్రం తప్పకుండా తెలుగు ప్రేక్షకులకు నచ్చుతుంది' అన్నారు. ఈ సందర్భంగా ముఫాసా చిత్రబృందం రూపొందించిన మహేశ్‌బాబు పోస్టర్‌ను నమ్రత ఆవిష్కరించారు. సత్యదేవ్, అలీ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ట్రై సైకిల్ పంపిణీ



ట్రైసైకిల్ అందజేస్తున్న లలితకుమారి

శృంగవరపుకోట రూరల్,డిసెంబరు1 : మండలంలోని పోతానపల్లికి చెందిన దివ్యాంగుడు ఈశ్వరరావుకు ఆదివారం ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి గురుదేవా చారిటబుల్ ట్రస్ట్ సమకూర్చిన బ్యాటరీ ట్రై సైకిల్ అందజేశారు. కార్యక్రమంలో జీఎస్ నాయుడు, కూనిరెడ్డి రాము, వాసు,ముత్యాలనాయుడు పాల్గొన్నారు.

బెంచీల వితరణ

గజపతినగరం, డిసెంబరు 1: (ఆంధ్రజ్యోతి): స్థానిక శాఖ గ్రంథాలయానికి జనసేన పార్టీ నాయకులు తాళ్లపూడి సావిత్రి త్రివేది ఆధ్వర్యంలో ఆదివారం మూడు బెంచీలను అందజేశారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి స్వప్న, సునీల్ పాల్గొన్నారు.

చీపురుపల్లిలో హాస్టల్ పరిశీలన

చీపురుపల్లి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి):చీపురుపల్లి బీసీ బాలికల హాస్టల్‌లో మెను అమలులో లోపాలున్నాయని జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి విసినిగిరి శ్రీనివాసరావు తెలిపారు. ఆదివారం వసతి గృహాన్ని పరిశీలించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ గత పాలకుల నిర్లక్ష్యం వల్ల హాస్టల్ నిర్వహణ ఇక్కడి సిబ్బంది గాలికొదిలేశారన్నారు.

నిత్యావసర సరుకుల పంపిణీ

కొత్తవలస, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తుమ్మికాపల్లి పంచాయతీ వినాయకనగర్‌లో గల ఫర్‌దిపీపుల్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో 43 మంది ఒంటరిగా జీవిస్తున్న వృద్ధులకు 12 రకాల నిత్యావసర వస్తువులను పంపిణీ చేశారు అమ్మసందీప్ క్యాటరింగ్, రైల్వే రిటైర్డ్ ఉద్యోగి రమణ ట్రస్టు సభ్యుల సాయంతో సరుకులు పంపిణీ చేసినట్టు ట్రస్టు చైర్మన్ విశ్వనాథ హరి కుమార్ తెలిపారు.కార్యక్రమంలో రవి, నగేష్, రాజు, రామారావు,తులసీబాయ్, శ్రీదేవి పాల్గొన్నారు.

టీడీపీ సభ్యత్వ నమోదు



సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహిస్తున్న టీడీపీ నాయకులు

శృంగవరపుకోట రూరల్, డిసెంబర్ 1 : మండలంలోని ధర్మవరంలోటీడీపీ నాయకుడు లగుడు తిరుపతి ఆధ్వర్యంలో ఆదివారం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ యువత జోల కేశవ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు సదుపాయం కల్పించండి

శృంగవరపుకోట, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): శృంగవరపుకోట శివారులోని రేగపుణ్యగిరి గిరిజన గ్రామానికి రోడ్డు సదుపాయం కల్పించాలని జనసేన నియోజకవర్గ నాయకుడు ఒబ్బిన సన్యాసినాయుడు కోరారు.ఈ మేరకు మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. అనారోగ్యానికి గురైన వారిని ఆసుపత్రికు తీసుకొచ్చేందుకు డోలీ కట్టాల్సి వస్తోందని తెలిపారు.

ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణ విరమించుకోవాలి

వేపాడ,డిసెంబరు1:విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణను ప్రభుత్వం విరమించుకోకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని మాల మహానాడు నాయకుడు దేబారిక కిరణ తెలిపారు. ఆదివారం విశాఖలోని కూర్మన్నపాలెం వద్ద చేపట్టిన ధర్నాకు మాల మహానాడు కార్యకర్తలు తరలివెళ్లినట్లు చెప్పారు.

పోలీస్ క్రీడల్లో సత్తాచాటిన నెల్లిమర్ల ఎస్ఐ

నెల్లిమర్ల, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): విజయనగరంలోజరిగిన పోలీస్‌స్పోర్ట్స్ మీట్‌లో భాగంగా షటిల్ బ్యాడ్మింటన్ పోటీల్లో నెల్లిమర్ల ఎస్ఐ గణేష్ సత్తాచాటారు. సింగిల్స్ విభాగంలో ద్వితీయ, డబుల్స్ విభాగంలో తృతీయ స్థానం సాధించారు. ఈమేరకు గణేష్‌ను విజయనగరం డీఎస్పీ శ్రీనివాసరావు, భోగాపురం రూరల్ సీఐ జి.రామకృష్ణ, నెల్లిమర్ల స్టేషన్ సిబ్బంది అభినందించారు.

సోంపురం విద్యార్థిని..

వేపాడ, డిసెంబరు 1: మండలంలోని సోంపురం హైస్కూల్ విద్యార్థిని హాసిని గత నెల 28న విజయనగరంలో గురజాడ స్వర్ణోత్సవంలో భాగంగా జరిగిన గురజాడ సాహితీ చైతన్య ఉత్సవం కార్యక్రమంలో నిర్వహించిన వక్తృత్వ, వ్యాచరచన పోటీల్లో సత్తాచాటింది. ఈమేరకు తృతీయస్థానం లభించడంతో సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీరమణ చేతుల మీదుగా ప్రశంసాపత్రం, జ్ఞాపిక అందుకున్నట్లు హెచ్ఎం బీపీఏ రాజు తెలిపారు.

సీసీ కెమెరాలు ఏర్పాటుచేయండి

సంతకవిటి, డిసెంబరు 1: (ఆంధ్రజ్యోతి): మండలంలోని మందరాడ పరిధిలో గల దుకాణదారులు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని ఎస్ఐ ఆర్.గోపాలరావు తెలిపారు. సీసీ కెమెరాలు షాపుల వద్ద ఏర్పాటు చేస్తే దొంగతనాలు జరిగిన వెంటనే అప్రమత్తమై చేధించడానికి ఆస్కారం ఉంటుందని చెప్పారు. ఈ మేరకు మందరాడ కూడలిలో దుకాణాల నిర్వాహకులకు ఎస్ఐ అవగాహన కల్పించారు.

కార్యాలయం లేక.. కార్యకలాపాలు సాగక



ఎల్.కోటలోని ఇరిగేషన్ కార్యాలయం ప్రస్తుత పరిస్థితి

- సొంత భవనం లేక...విధుల నిర్వహణకు ఇబ్బందులు
- అధికారులను కలవడానికి రైతుల అగచాట్లు
- ఇదీ ఎల్.కోటలో జలవనరుల శాఖ కార్యాలయం పరిస్థితి

లక్కవరపుకోట, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): లక్కవరపుకోటలో జలవనరుల శాఖ కార్యాలయానికి సొంత భవనం లేకపోవడంతో సిబ్బంది విధులు నిర్వహణకు ఇబ్బంది పడుతున్నారు. ప్రధానంగా ఎల్.కోట కేంద్రంగా ఎల్.కోట, వేపాడ, కొత్తవలస మండలాల జలవనరుల శాఖ కార్యకలాపాలు సాగడం కష్టతరంగా మారింది. అధికారులను కలవడానికి అగచాట్లకు గురవుతున్నారు. కనీసం అద్దె కార్యాలయం కూడా ఏర్పాటుచేయలేదు. దీంతో ఎల్.కోట వచ్చే అధికారులు ఎక్కడ ఉండాలో తెలియక అయోమయానికి గురవుతున్నారు. కొన్నిసార్లు మండలకేంద్రంలోని ఏదో ఒక ప్రభుత్వ కార్యాలయంలో కాలం గడిపి విధులు ముగించుకొని వెళ్లాల్సివస్తోంది.

శిథిలావస్థకు చేరిన భవనం

ఎల్.కోట కేంద్రంగా గతంలో ఎల్.కోట, వేపాడ, కొత్తవలస మండలాలకు పురాతన కార్యాలయం ఉండేది. అది శిథిలావస్థకు చేరింది. దీంతో సుమారు 15 ఏళ్లుగా కార్యాలయం లేక జలవనరుల శాఖ అధికారులు రికార్డుల నిర్వహణకు ఇబ్బందిపడుతున్నారు. మూడు మండలాలు కలిపి సుమారు 850 వరకు సాగునీటి చెరువులు ఉన్నాయి. నీటి ద్వారా సుమారు 10 వేల హెక్టార్ల పంటను రైతులు సాగుచేస్తున్నారు. 53 నీటి సంఘాల ద్వారా సుమారు 40వేల మందికిపైగా రైతులు సభ్యులుగా నమోదయ్యారు. నీటి సంఘాలు, ఉపాధిహామీ పథక నిధులతో పలు చెరువులకు కోట్ల రూపాయలు అభివృద్ధి పనులు, మరమ్మతులు జరుగుతున్నాయి. దీనికి సంబంధించిన బిల్లులు, పర్యవేక్షణకు కార్యాలయం లేకపోవడంతో అధికారులు, కాంట్రాక్టర్లకు అవస్థలు తప్పడం లేదు. కాగా కొత్త భవనం నిర్మాణానికి అంచనాలు పంపించామని ఇరిగేషన్ జేఈ హనుమంతు తెలిపారు. సరైన స్థలం లభించలేదని చెప్పారు.

పారిశుధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



నిరసన తెలుపుతున్న పారిశుధ్య కార్మికులు

విజయనగరం దాసన్నపేట, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): నగరపాలక సంస్థలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికుల సమస్యల పరిష్కరించాలని విజయనగరం మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో అమర్‌భవన్ కార్యాలయం వద్ద ఆదివారం నిరసన తెలిపారు.ఈ సందర్భంగా సంఘ నాయకులు మాట్లాడుతూ మునిసిపల్ కార్మికులకు మూడేళ్ల సరెండర్ సెలవుల నిధులు వారి ఖాతాల్లో జమ చేయాలని, కాంట్రాక్టు పారిశుధ్య కార్మికులను 62 ఏళ్ల వరకు కొనసాగించాలని డిమాండ్‌చేశారు. కాంట్రాక్టు పారిశుధ్య కార్మికులకు పదవీ విరమణ చేసే సమయానికి రూ. 75 వేల గ్రాట్యూటీతోపాటు, ఏడాదికి రూ.2 వేలు ఇస్తామన్న వాగ్దానాన్ని అమలు చేయాలన్నారు. డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఎంఏ అండ్ యూడీ రాష్ట్ర ప్రిన్సిపాల్ సెక్రటరీకి అందజేస్తామని రాష్ట్ర ఆఫీస్ బేరర్, కన్వీనర్ పొడుగు రామకృష్ణ, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.నాగరాజు తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి బుగత అశోక్, జిల్లా అధ్యక్షులు జలగడుగుల కామేష్ పాల్గొన్నారు.

అభివృద్ధిలో భాగస్వాములు కావాలి

- ఏపీ మార్క్‌ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు



మాట్లాడుతున్న కర్రోతు బంగార్రాజు

నెల్లిమర్ల, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధి సాధనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఏపీ మార్క్‌ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు కోరారు. ఆదివారం నెల్లిమర్ల మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అంబళ్ల సుధారాణి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఉపాధి హామీ పథకం నిధులతో గ్రామాలకు మంజూరైన అభివృద్ధి పనుల విషయంలో వెండర్ రిజిస్ట్రేషన్ విధానంపై బొప్పడాం, సతివాడ, టెక్కలి, పారసాం సర్పంచ్‌లు అంబళ్ల కిరణ్, రేవళ్ల శ్రీనివాసరావు, నేతేటి స్వామినాయుడు, నారాయణరావు ఆగ్రహం వ్యక్తంచేశారు.వెండర్ రిజిస్ట్రేషన్ పేరుతో బయటి వ్యక్తులకు పనులను అప్పగించడంపై తాము వ్యతిరేకతను వ్యక్తం చేస్తున్నామని డిమాండ్‌చేయడంతో ఈ మేరకు తీర్మానంచేసి ప్రభుత్వానికి నివేదించాలని ఎంపీపీ సుధారాణి ఆదేశించారు. ధాన్యం కొనుగోలు తదితర అంశాలపై వాడివేడి చర్చ జరిగింది. సమావేశంలో ఎంపీడీవో రామకృష్ణరాజు, ఈవోపీఆర్డీ జి.శంకర్ జగన్నాథం పాల్గొన్నారు. కాగా కర్రోతు బంగార్రాజుకు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు సత్కరించారు. అలాగే విజయనగరంలో తూర్పుకాపు సామాజిక వేదిక ఆధ్వర్యంలో జరిగిన ఆత్మీయకలయకలో కూడా సన్మానించారు.

ఆరు నెలల్లో ప్రజలకు ఏం చేశారు : బెల్లాన

చీపురుపల్లి,డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): ఆరునెలల్లో ప్రజలకేం చేశారో కూటమి నాయకులు సమాధానం చెప్పాలని మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. ఆదివారం చీపురుపల్లి విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికల ముందు విద్యుత్ చార్జీల మోత ఉండదని ప్రకటించి, గద్దెనెక్కిన ఆరునెలల్లో రూ.15485.36 కోట్ల అదనపు భారాన్ని విద్యుత్ వినియోగదారుల నెత్తిన మోపారని ఆరోపించారు. అధికారంలోకి రాగానే అమల చేస్తామని చెప్పిన సూపర్ సిక్స్ పథకాలను గాలికి వదిలేశారని విమర్శించారు.సమావేశంలో కె.చిరంజీవి, ముల్లు పైడిరాజు, గరిడ రాందాసు పాల్గొన్నారు.

- విజయనగరం టౌన్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలను తుంగలో తొక్కిందని జడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు ఆరోపించారు. విజయనగరంలో విలేకరులతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఐదేళ్లపాటు విద్యుత్ చార్జీలు పెంచబోమని చంద్రబాబునాయుడు హామీ ఇచ్చారని, అయితే ప్రభుత్వం ఏర్పాటైన ఐదు నెలల్లో రెండుసార్లు పెంచారని ఆరోపించారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు పీరుబండి జైహింద్‌కుమార్ పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీలను తగ్గించాలి

గజపతినగరం, డిసెంబరు 1: (ఆంధ్రజ్యోతి): పెంచిన విద్యుత్ చార్జీలను తక్షణమే తగ్గించకపోతే ప్రజాగ్రహానికి గురికాక తప్పదని మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య హెచ్చరించారు. ఆదివారం గజపతినగరంలో విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో ఫ్రీ హోల్డ్‌భూములు ఆక్రమణలపై అధికారులు నిగ్గుతేల్చాలని కోరారు. ఈ భూములకు సంబంధించి ఎవరు తప్పుచేసినా బయటకు తీయాలన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ గారతవుడు, ఏఎంసీ చైర్మన్ వేమలి ముత్యాలనాయుడు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి కృషి

- నెల్లిమర్ల ఎమ్మెల్యే నాగమాధవి



జనసేనలో చేరిన వారితో లోకం నాగమాధవి

భోగాపురం, డిసెంబరు1(ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నట్లు నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకంనాగ మాధవి తెలిపారు. మండలంలోని ముంజేరు సమీపంలోగల జనసేన పార్టీ కార్యాలయంలో డెంకాడ మండలం నుంచి 10 కుటుంబాలు, నెల్లిమర్ల మండలంలోని జర్జాపేట నుంచి 30 కుటుంబాలు ఆదివారం వైసీపీ నుంచి జనసేనలో చేరాయి. ఈ సందర్భంగా మాట్లాడుతూకూటమి ప్రభుత్వం పని తీరు నచ్చి ప్రజలు జనసేనలో చేరుతున్నారని తెలిపారు.

108 శివలింగాలకు రుద్రాభిషేకాలు

కొత్తవలస, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) :తుమ్మికాపల్లి గేట్ సమీపంలో గల ఓం సదనంలో కార్తీక మాసం ముగింపు పురస్కరించుకుని ఆదివారం 108 శివలింగాలకు రుద్రాభిషేకాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఓం సదనం నిర్వాహకులు అంపోలు ఉమామహేశ్వర శర్మ పూజలు చేశారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలు మృతి

గజపతినగరం,డిసెంబరు 1: (ఆంధ్రజ్యోతి) మండలంలోని గుడివాడ జాతీయ రహదారిపై గుర్తుతెలియని వాహనం ఓ వృద్ధురాలిని ఆదివారం ఢీకొనడంతో మృతి చెందింది. ఎస్ఐ కె.లక్ష్మణరావు కథనం మేరకు..దత్తిరాజేరు మండలంలోని పెదమానాపురానికి చెందిన రాజేటి కృష్ణవేణి (78)శనివారం ఉదయం వృద్ధాప్య పింఛన్ తీసుకొని విశాఖలో ఉన్న తన సోదరి ఇంటికి వెళ్లింది. అక్కడ సోదరి ఇల్లు దొరక్కపోవడంతో తిరుగుప్రయాణమయ్యింది. మదుపాడ జంక్షన్ వద్ద కృష్ణవేణిని గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందింది. కృష్ణవేణికి పెళ్లైన కొద్దిరోజులకే భర్త మృతిచెందాడు.దీంతో పిల్లలు లేకపోవడంతో ఒంటరిగా జీవిస్తోంది. కృష్ణవేణి మేనల్లుడు ఎం.రమేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

ఆటో ఢీకొనడంతో ఒకరు..

రాజాం రూరల్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): రాజాం-శ్రీకాకుళం రోడ్‌లో శనివారం రాత్రి ఆటో ఢీకొని మృతిచెందిన వ్యక్తిని దోసరి గ్రామానికి చెందిన కురమాన పెంటయ్య(50)గా పోలీసులు గుర్తించారు. శ్రీకాకుళం రోడ్‌లో పనిచేస్తున్న ఆయన శనివారం రాత్రి ఎనిమిది గంటల ప్రాంతంలో నడుచుకుని వెళ్తున్నాడు. ఆ సమయంలో రాజాం నుంచి పొగిరి వైపు వెళ్తున్న ఆటో ఢీకొనడంతో పెంటయ్య తలకు గాయాలుకావడంతో అక్కడకక్కడే మృతిచెందాడు. పెంటయ్య భార్య చిన్నప్పమ్మ ఫిర్యాదుమేరకు పోలీసులు కేసు నమోదుచేశారు.

16 మద్యం సీసాలు స్వాధీనం

విజయనగరం క్రైం, డిసెంబరు1 (ఆంధ్రజ్యోతి):పూసపాటిరేగ మండలంలోని కనిమెల్లలో మద్యం బెల్ట్ దుకాణాలపై ఆదివారం ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ కమిషనర్ పి.రామచంద్రరావు ఆదేశాల మేరకు ఎస్ఐ రాజాశ్రీ ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు.ఈమేరకుగ్రామంలో బెల్టుదుకాణం నిర్వహిస్తున్న ఎస్.రమణ నుంచి 16మద్యం సీసాలు స్వాధీనంచేసుకుని కేసు నమోదుచేశామని ఎస్ఐ తెలిపారు.

పోలిపాడ్యమికి ఏర్పాటుచేయండి: ఎస్పీ

విజయనగరం క్రైం, డిసెంబరు1(ఆంధ్రజ్యోతి): పోలిపాడ్యమి పురస్కరించుకుని సోమవారం జిల్లా వ్యాప్తంగా నదీ తీరాలు, శివాలయాల వద్ద బందోబస్తు ఏర్పాటు చేయాలని పోలీసు అధికారులకు ఎస్పీ వకుల్ జిందల్ ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. పెద్దసంఖ్యలో భక్తులు నదులు, సముద్రతీరాల్లో స్నానాలు ఆచరించే అవకాశం ఉండడంతో ప్రమాదాలు, అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భద్రతా చర్యలు చేపట్టాలని ఆదేశించారు.స్నానాలు ఆచరించేప్రదేశాల్లో భక్తులు మునిగిపోకుండా హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని కోరారు. సామగ్రి దొంగతనం జరగకుండా మఫ్టీలో పోలీసులు ఏర్పాటు చేయాలని తెలిపారు. డీఎస్పీలు, సీఐలు పర్యవేక్షించాలని కోరారు.

రామతీర్థం ఆలయంలో పూజలు



ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

నెల్లిమర్ల, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): రామతీర్థం రామస్వామి వారి దేవస్థానాన్ని శాసనమండలిలో ప్రభుత్వ విప్ వేపాడ చిరంజీవిరావు ఆదివారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా సీతారాములను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయనకు టీడీపీ నాయకులు సువ్వాడ రవిశేఖర్, గేదెల రాజారావు, లెంక అప్పలనాయుడు, అల్తి శ్రీనివాసరావు, కోటపాటి తిరుపతిరావు, తాడ్డి సత్యనారాయణ, అట్టాడ శ్రీధర్, బయిరెడ్డి కళ్యాణ్‌చక్రవర్తి సత్కరించారు.

భక్తిశ్రద్ధలతో అయ్యప్ప స్వాముల పూజలు



కన్నెస్వాముల పూజలో పాల్గొన్న అయ్యప్ప దీక్షాదారులు

రాజాం రూరల్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): రాజాంలోని శాస్తాసమాజంలో ఆదివారం కన్నెస్వాములు పూజ భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. 100 మంది అయ్యప్ప దీక్షాధరులు సమాజ పీఠాధిపతి ఉమాపతి శేషు గురుస్వామి సారధ్యంలో వేద పండితులు రాజుస్వామి, చంటిస్వామి ఆధ్వర్యంలో సంప్రదాయబద్ధంగా పూజలు చేశారు.ఈసందర్భంగా అయ్యప్పస్వామికి పాల, పంచామృతాభిషేకం నిర్వహించారు.

నీటిని బయటకు పంపేందుకు చర్యలు చేపట్టాలి

నెల్లిమర్ల, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): వరి పొలంలో నిలిచిపోయిన వర్షపునీటిని బయటకు పంపించేలా రైతులు చర్యలు తీసుకోవాలని, ఇందుకోసం బాటలు వేసుకోవాలని ఏవో ఎం.పూర్ణిమ సూచించారు. రెండు రోజులుగా వర్షాలు కురుస్తుండడంతో ఆదివారం నెల్లిమర్ల తదితర గ్రామాల్లో పంటపొలాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా వర్షం తగ్గగానే ఐదు శాతం ఉప్పు ద్రావణం ఐదుగ్రాములు లీటరు నీటిలో కలిపి తడిచిన కుప్పలు, ఎన్నులు మీద పిచికారీ చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈవోలు టి.హేమ మహేష్, వీఏఏ కె.శ్యామ్‌కుమార్ పాల్గొన్నారు.

నిర్వహణ లేక.. నీరందక

- తాగునీటికి విద్యార్థుల అవస్థలు
- మూలకుచేరిన ఆర్వోప్లాంట్
- ఇదీ రాజాం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పరిస్థితి



నిరుపయోగంగా మారిన ఆర్వో ప్లాంట్

రాజాం రూరల్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): రాజాం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థుల తాగునీటి అవసరాల కోసం ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంట్ నిర్వహణ లేకపోవడంతో మూలకుచేరింది. దీంతో విద్యార్థులకు తాగునీరందని పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో ఇక్కడి విద్యార్థులు ప్రభుత్వోన్నత పాఠశాలతో పాటు ఇతర ప్రాంతాల్లో గల తాగునీటి కోసం ఆధారపడుతున్నారు. గతంలో ఇంటర్ తరగతులు ఒకేపూట నిర్వహించేవారు. విద్యాశాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రస్తుతం రెండు పూటలా ఇంటర్ తరగతులు నిర్వహిస్తున్నారు. దీంతో కళాశాలలో తాగునీటికి మరింతగా ఇబ్బందిపడుతున్నారు. కాగావైసీపీ ప్రభుత్వ హయాంలో నాడు-నేడు పనుల్లో భాగంగా చేపట్టిన భవన నిర్మాణాలు, మరుగుదొడ్లు, ఫినిషింగ్ వర్క్స్, ఆర్వో ప్లాంట్ ఏర్పాటు, మెయిన్‌గేటు తయారీతో పాటు పాత బెంచీల మరమ్మతుల కోసం లక్షకు పైగా ఖర్చుపై జోరుగా ఆరోపణలొచ్చిన విషయం విదితమే. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటైన నేపథ్యంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గతేడాది చేపట్టిన నాడు నేడు అభివృద్ధి పనులలో జరిగిన అవినీతి, అక్రమాలపై దర్యాప్తు నిర్వహించాలని పలువురు కోరుతున్నారు.

అస్సాందే విజయం

- పాండిచ్చేరిపై రెండు పరుగుల తేడాతో గెలుపు



మ్యాచ్‌కు సిద్ధమవుతున్న అస్సాం, పాండిచ్చేరి జట్ల క్రీడాకారులు

విజయనగరం టౌన్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): సయ్యద్ ముస్తాక్ అలీ టీ-20 దేశవాళీ క్రికెట్ టోర్నీలో అస్సాం జట్టు పాండిచ్చేరి జట్టుపై 2 పరుగుల తేడాతో విజయం సాధించింది. డెంకాడ మండలం చింతలవలసలోని పీవీజీ రాజు క్రికెట్ మైదానంలో ఆదివారం ఇరు జట్లు తలబడ్డాయి. వర్షం కారణంగా మ్యాచ్‌ను 12 ఓవర్లకు కుదించారు.టాస్‌గెలిచిన అస్సాం ఫీల్డింగ్ ఎంచుకుంది. బ్యాటింగ్‌కు దిగిన పాండిచ్చేరి 12 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 125 పరుగులు చేసింది. ఓపెనర్ కేబీ అరుణ్‌కార్తీక్ 24 బంతుల్లో 4 ఫోర్లు, 2 సిక్సులతో 41 పరుగులు చేశాడు. వన్‌డౌన్ బ్యాటర్ ఆకాష్ కార్గేవ్ 27 బంతుల్లో 5 సిక్సులు, 3 ఫోర్లతో అర్థ సెంచరీ (56) సాధించాడు. 126 పరుగుల విజయ లక్ష్యంతో బ్యాటింగ్ చేపట్టిన అస్సాం ధాటిగా ఆడే ప్రయత్నంలో ఓపెనింగ్ జోడి రుహినందన్ డకౌట్‌గా వెనుదిరగ్గా, కెప్టెన్ దినేష్‌దాస్ 7 పరుగులకే అవుటయ్యాడు. ఫస్ట్ డౌన్‌లో వచ్చిన రాయ్ 24 బంతుల్లో 43, మిడిలార్డర్ బ్యాటర్ గాడిగోంకర్ 19, సాహిల్ జైన్ 13 బంతుల్లో 20 పరుగులు చేశారు. మరోసారి వర్షం అంతరాయం కలిగించడంతోపాటు వెలుతురు మందగించడంతో అంపైర్లు ఆటను నిలిపేశారు. దీంతో విజేడీ విధానంలో మెరుగైన రన్‌రేట్ ఉన్న అస్సాం 2 పరుగులతో గెలిచినట్లు అంపైర్లు ప్రకటించారు. ఈ విజయంతో ఆ జట్టు ఖాతాలో 4 పాయింట్లు చేరాయి.

విద్యార్థులకు హోలీస్టిక్ కార్డులు

గరివిడి, డిసెంబరు1(ఆంధ్రజ్యోతి):ప్రభుత్వం విద్యార్థి ప్రతిభను తెలియజేసేందుకు ఇప్పటివరకు ప్రోగ్రస్ కార్డులు పంపిణీ చేసేది. అయితే జిల్లాలోని పాఠశాలల్లో కూటమి ప్రభుత్వం ఈ ప్రోగ్రస్ కార్డులకు బదులుగా హోలీస్టిక్ కార్డులు (సమగ్ర ప్రగతి పత్రాలు) ఇవ్వాలని నిర్ణయించింది. ఇప్పటికే కార్డులను ప్రభుత్వ పాఠశాలలకు అందజేశారు. ఈ కార్డుల్లో విద్యార్థి చదువుతోపాటు విద్యార్థి అభిరుచులు, బ్లడ్‌గ్రూపు, ఎత్తు, బరువు, బీఎంఐ వంటి తదితర అంశాలు పొందుపరచారు.ఈ కార్డులను ప్రతి ఆరు నెలలకు ఒకసారి విద్యార్థులతల్లిదండ్రులకు ఉపాధ్యాయులు అందజేయనున్నారు. దీంతో విద్యార్థి ఆరోగ్య పరిస్థితితోపాటు ఏ విధంగా చదువుతున్నాడు అనే విషయం కూడా తల్లిదండ్రులకు తెలియనుంది.త్వరలోనే జరగనున్న తల్లిదండ్రుల సమావేశంలో ఉపాధ్యాయులు విద్యార్థుల తల్లిదండ్రులకు ఒకేసారి పంపిణీ చేయడానికి ఏర్పాట్లు చేస్తున్నారు.

తీరంలో బోట్లు.. వేటకు దూరంగా మత్స్యకారులు



ముక్కాం తీరానికి పరిమితమైన పడవలు

భోగాపురం, డిసెంబరు1(ఆంధ్రజ్యోతి): మండలంలోని ముక్కాం, కొండరాజుపాలెం, చేపలకంజేరు తీరంలో 2000 వేల మంది మత్స్యకారులు తుఫాన్ వల్ల చేపలవేటకు నాలుగు రోజులుగా దూరమయ్యారు.ఈ నేపథ్యంలో బోట్లు తీరానికి చేర్చారు. వేట లేకపోవడంతో పోషణ కష్టంగా ఉందని పలువురు వాపోతున్నారు. తుఫాన్ నేపథ్యంలో సముద్ర తీరంలో చలి గాలులు పెరిగాయి. సముద్రం అల్లకల్లోలంగా మారడంతోపాటు కెరటాలు తీరాన్ని ఉధృతంగా తాకుతుండడంతో మత్స్యకారులు ఆందోళన చెందుతున్నారు.

మరమ్మతులులేక.. వినియోగానికి నోచుకోక

- ఇదీ విజయనగరం ఎంఈవో కార్యాలయం పరిస్థితి

విజయనగరం టౌన్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి):జిల్లా కేంద్రం శివారులోగల వేణుగోపాలపురం డైట్ కళాశాల సమీపంలోని ఎంఈవో కార్యాలయం నిర్వహణ, మరమ్మతులు లేకపోవడంతో నిరుపయోగంగా మారింది. ప్రధానంగా జిల్లా కేంద్రానికి దూరంగా ఉండడంతోపాటు శిథిలావస్థకు చేరడంతో కార్యాలయాన్ని నగరంలోకి తరలించారు. ఇక్కడ జిల్లా విద్యాశాఖ ఆధీనంలో పలుభవనాలు నిరుపయోగంగా ఉన్నాయి. ప్రధానంగా ఎంఈవో, పట్టు పరిశ్రమల శాఖల భవనాల చుట్టూ పిచ్చిమొక్కలు పెరగడంతో స్థానికులు భయాందోళన చెందుతున్నారు. ప్రస్తుతం పట్టుపరిశ్రమల శాఖ కార్యాలయం ఇక్కడ శిథిలావస్థకు చేరిన భవనాల్లో నిర్వహిస్తున్నారు. తక్షణమే ఎంఈవో కార్యాలయం వినియోగంలోకి తీసుకురావాలని పలువురు కోరుతున్నారు.



తుప్పల మధ్య నిరుపయోగంగాఉన్న ఎంఈవో కార్యాలయ భవనం

ANDHRA JYOTHI AJC CLASSIFIEDS ఆంధ్రజ్యోతి

FINANCIAL SERVICES
Govt. ఉద్యోగస్తులకు, రిటైర్డ్ పెన్షనర్లకు నెలవారీ పద్ధతిలో గాని, సులభ వాయిదా పద్ధతిలో గాని 50 వేలు నుండి 5 లక్షలు వరకు ఫైనాన్స్ చేయబడును. Reg.No. 136/2009, Cont: 9am to 8 pm, సెల్: 96665 47338.
AJD:199728

ఆంధ్రజ్యోతి
అచిరకాలంలో అశేష ప్రజాదరణ చూరగొన్న ఆంధ్రజ్యోతికి చందాదారులుగా చేరాలనుకుంటున్నారా! అయితే దిగువ పేర్కొన్న ఫోన్ నెంబర్లలో ఏ నెంబరుకైనా ఫోన్ చేసి చెపితే చాలు మా సిబ్బంది తక్షణం వచ్చి మీకు పత్రిక అందే ఏర్పాటు చేస్తారు. అంతేకాదు, పత్రిక పంపిణీలో మీరు ఏమైనా అసౌకర్యం ఎదుర్కొంటున్న యెడల నిస్సంకోచంగా ఫోన్ చేసి చెప్ప వచ్చు. మా సిబ్బంది సదా మీ సేవకు సిద్ధంగా ఉంటారు.
ఫోన్ నెంబర్లు : ACM : 99854 11514
ACO : 99854 11533
Office : 08942 - 281995

పాఠకులకు ముఖ్య గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన/క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి

క్లాసిఫైడ్స్ కొరకు సంప్రదించాల్సిన నెంబర్లు:
9985411522, 9985479944, 9985406982, 9440567403, 9985489266

పంట చేతికొచ్చే సమయంలో..

- చిరు జల్లులతో తడిచిన పంటలు
- వీడని ఫెంగల్.. ఆందోళనలో రైతన్నలు
- పలుచోట్ల నేలకొరిగిన వరి
- పత్తి, కూరగాయ పంటలకూ నష్టం

ఫెంగల్ తుపాన్ ప్రభావంతో గత మూడు రోజులుగా ఉమ్మడి జిల్లా అంతటా చెదురుమదురుగా వర్షాలు కురుస్తున్నాయి. దీంతో వరి పంట తడిచి ముద్దవుతోంది. కోత కోసి వరి పనాల రూపంలో ఉన్న పంట పొలాల్లోనే తడుస్తోంది. మరో మూడు రోజులు ఇలాగే ఉంటే మొలకెత్తే అవకాశం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. కోతకు సిద్ధంగా ఉన్న వరి పంట కోయలేని పరిస్థితి ఉంది. నూర్పు చేసిన ధాన్యం కల్లాల్లోనే దర్శనమిస్తోంది. రైతన్నలు వరి కుప్పలు, ధాన్యం రాశులపై టార్పాలిన్లు కప్పి రక్షించుకుం టున్నారు. తుపాన్ ప్రభావంతో పత్తి, కూరగాయల పంటలకు కూడా నష్టం వాటిల్లుతోంది. ఇంకా చాలా పత్తి పంట పొలా ల్లోనే ఉంది. పలు గ్రామాల్లో టార్పాలిన్లు కొరత ఉంది. ఫెంగల్ తుపాన్ ప్రభావంతో మరో మూడు నాలుగు రోజుల పాటు ఇదే వాతావరణ పరిస్థితి ఉంటుందని వాతావరణ శాఖ చెబుతోంది. సాలూరు ఏజెన్సీలో కొన్ని చోట్ల బరువైన రకాల వరి పంట నేల కొరిగింది. కోతలు కోసిన వారు ఇప్పుడిప్పుడే నూర్పులు చేయొద్దంటు సాలూరు వ్యవసాయాధికారి అనురాధ పండా సూచించారు. **(ఆంధ్రజ్యోతి బృందం)**


సాలూరు రూరల్: ధాన్యంపై టార్పాలిన్లు కప్పిన దృశ్యం


పాలకొండ: వరి కుప్పలపై టార్పాలిన్లు కప్పిన దృశ్యం


వీరఘట్టం: నడుకూరులో కుప్పలు వేసిన వరి


గరుగుబిల్లి: రహదారికి పక్కన..


మక్కువ: పొలంలో కోసిన పంట


భామిని: పసుకుడిలో క్యాబేజీ సేకరిస్తున్న రైతులు


గరివిడి: బాగువలసలో దెబ్బతిన్న టమోటా పంట

వేయింగ్ మెషిన్ బాగు చేయరూ..

- తూకం కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితి


ఇంకా వినియోగంలోకి రాని వేయింగ్ మెషిన్

వీరఘట్టం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): వీరఘట్టం మార్కెట్ యార్డు స్థలంలో ఉన్న వేయింగ్ మెషిన్ వినియోగంలోకి రాకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. లక్షల రూపాయలు ఖర్చు చేసి నిర్మించిన ఈ మెషిన్‌ను ఉపయోగించకపోవడంతో మరమ్మతులకు గురయ్యింది. రైతుల వద్ద నుంచి కొనుగోలు చేసిన ధాన్యాన్ని తూకం కోసం గరుగుబిల్లి మండలం నాగూరు గానీ పాలకొండ గానీ వెళ్లి తూకం చేయాల్సి వస్తుంది. దీంతో అదనపు ఖర్చు అవుతుంది. సివిల్ సప్లయి డిపార్ట్‌మెంట్ వారు నిర్మించిన ఈ యంత్రం రైతులకు ఉపయోగపడకుండా పోతుంది. ధాన్యం కొనుగోలు ప్రారంభించక ముందే మరమ్మతులు చేసి ఉంటే రైతులకు ఎంతగానో ఉపయోపడేది. కానీ అధికారులు ముందుచూపు లేని కారణంగా నేటికీ మరమ్మతులు పూర్తి కాలేదు. ఇప్పటికైనా అధికారులు ఈ వేయింగ్ మెషిన్‌ని బాగు చేసి, వినియోగంలోకి తీసుకు రావాలని రైతులు కోరుతున్నారు.

త్వరలో అందుబాటులోకి..

తూకపు యంత్రాన్ని మరమ్మతులు చేస్తున్నాం. త్వరలో అందుబాటులోకి తీసుకొస్తాం. రైతులకు ఇబ్బందులు లేకుండా చూస్తాం.
- పి.శ్రీనివాసరావు, సివిల్ సప్లయ్స్ డీఎం

నీలకంఠేశ్వర స్వామికి రుద్రాభిషేకం

- పూజల్లో పాల్గొన్న కురుపాం ఎమ్మెల్యే


పూజల్లో పాల్గొన్న కురుపాం ఎమ్మెల్యే జగదీశ్వరి

కురుపాం రూరల్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం చివరి ఆదివారం పురస్కరించుకుని కురుపాం మండలంలోని మొండెంఖల్ గ్రామంలోగల ప్రసిద్ధి చెందిన మరకత నీలకంఠేశ్వర స్వామి దేవస్థానంలో రుద్రాభిషేకం నిర్వహించారు. ఈ పూజల్లో కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి పాల్గొన్నారు. అనంతరం మొండెంఖల్‌లోని వైభవ వేంకటేశ్వర స్వామిని దర్శించుకున్నారు. ఈ పూజల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

చెరువునూ వదలరా?

(5వ పేజీ తరువాయి)

సాగునీరు అందుతుండేది. అటువంటి చెరువును సంరక్షించాల్సిన బాధ్యత అధికారులపై ఉంది కానీ తమ పనికాదన్నట్టు అధికారులు వ్యవహరిస్తున్నారు. వెరసి చెరువు పూర్తిగా నిర్లక్ష్యానికి గురైంది. కనీస నిర్వహణకు నోచుకోవడం లేదు. సమీప నివాసితులు చెత్తను యథేచ్ఛగా పారబోస్తున్నారు. అటు రాజాం, ఇటు సారధికి చెందిన వ్యాపారులు వ్యర్థాలను పారబోస్తున్నారు. షాపుల వద్ద ఉండే చెత్తను ఇక్కడ డంపింగ్ చేస్తున్నారు. దీంతో చెరువులో వర్షపు నీరు చేరినప్పుడు అవి కుళ్లి దుర్వాసన వస్తోంది. దీంతో సమీప నివాసితులు సైతం అసౌకర్యానికి గురవుతున్నారు. చెరువు ఆయకట్టుకు పూర్తిస్థాయిలో సాగునీరు అందకుండా పోతోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి చెరువును సంరక్షించాలని రాజాం, సారధి ప్రజలు కోరుతున్నారు.

ఆ నిర్మాణాల సంగతేంటి?

(5వ పేజీ తరువాయి)

అవి కనబడడం లేదు. విజయనగరంలో అక్రమ బహుళ అంతస్థుల భవన నిర్మాణాలు ఎక్కడెక్కడ ఉన్నాయో? చిరునామాలతో సహా టౌన్ ప్లానింగు అధికారుల వద్ద సమాచారం వుంది. వాటిలో చాలా వరకూ నాయకులు, కొంతమంది ప్రజాప్రతినిధుల సన్నిహితుల అండదండలు వుండడం, అలాగే కొందరి నుంచి ముడుపులు అందడంతో తనిఖీ చేయడానికి అధికారులు అటువైపు వెళ్లడం లేదు. కాగా నగరపాలక సంస్థ కమిషనర్ చాలా కఠినం అంటూ.. ఆయన పేరు చెప్పి.. కొందరు ప్లానింగు, రెగ్యులరేషన్ సెక్రటరీలు పేద, మధ్య తరగతి వర్గాల ఇళ్ల వద్దకు వెళ్లి వేధిస్తున్నారు. వారిలో భయాందోళన సృష్టిస్తున్నారు. పురపాలక శాఖ మంత్రి పి.నారాయణ ఇటీవల మాట్లాడుతూ నిరుపేద, పేద, మధ్యతరగతి వారు నివసిస్తున్న ఇళ్ల నిర్మాణం 100 గజాల్లోపు వుంటే.. వారిని ఇబ్బంది పెట్టొద్దని అన్నారు. ఆక్రమణ కాకుండా.. ఉన్న ఇంటినే మళ్లీ కట్టుకున్నా కూడా ప్లానింగు సెక్రటరీలు ఇబ్బందులు పెడుతున్నారు.

ఎయిడ్స్‌పై అప్రమత్తం

- జిల్లా వ్యాప్తంగా అవగాహన ర్యాలీలు

హెచ్‌ఐవీ, ఎయిడ్స్ వ్యాధి పట్ల యువత అప్రమత్తంగా ఉండాలని ఆస్పత్రుల వైద్యాధికారులు కోరారు. ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా జిల్లా వ్యాప్తంగా ఆదివారం ప్రభుత్వ ఆస్పత్రుల ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీలు నిర్వహించారు. వైద్యులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు. యువత చెడు వ్యసనాలకు లోను కావద్దని సూచించారు.

అందరితో పాటే సమాన హక్కులు

బొబ్బిలి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): హెచ్‌ఐవీ బాధితులకు కూడా అందరి పౌరుల మాదిరిగానే సమాన హక్కులు ఉంటాయని న్యాయసేవా కమిటీ ఛైర్‌పర్సన్, సీనియర్ సివిల్ న్యాయాధికారిణి ఎస్.అరుణశ్రీ అన్నారు. ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ కమ్యూనిటీ ఆసుపత్రిలో వైద్యాధికారి శశిభూషణరావు ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన అవగాహన ర్యాలీలో ఆమె పాల్గొని, మాట్లాడారు. ఎయిడ్స్ సోకినవారికి చికిత్స నిరాకరించరాదని, వారి వివరాలు గోప్యంగా ఉంచాలని, లేని ఎడల శిక్షార్హులు అవుతారని తెలిపారు.



ర్యాలీ నిర్వహిస్తున్న న్యాయాధికారిణి అరుణశ్రీ, వైద్య సిబ్బంది

నిర్మాత రత్నాకర్‌కు గుర్తింపు

పాలకొండ, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): కౌసల్య తనయ రాఘవ చిత్ర నిర్మాత, పాలకొండ పట్టణానికి చెందిన అడపా రత్నాకర్‌కు 2024 బెస్ట్ డెబ్యూట్ ప్రొడ్యూసర్ అవార్డు దక్కింది. విశాఖ ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్-2024 బెస్ట్ డెబ్యూట్ ప్రొడ్యూసర్‌గా రత్నాకర్ ఎంపికయ్యారు. ఈ మేరకు విశాఖలో డిసెంబరు 29న ఈ అవార్డును అందజేస్తున్నట్టు ఇండియన్ ఫిల్మ్ మేకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రామచంద్రారెడ్డి తెలిపారు.

6 నుంచి దళితుల గర్జన

బొబ్బిలి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): దేశంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలు, బహుజనులపై జరుగుతున్న అత్యాచారాలు, హత్యలు, దాడులకు నిరసనగా ఈనెల 6 నుంచి దళిత గర్జన పేరుతో ఆందోళన కార్యక్రమాలకు శ్రీకారం చుట్టినట్టు అంబేడ్కర్ పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు సోరు సాంబయ్య తెలిపారు. ఈ మేరకు ఆదివారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన కరపత్రాలను విడుదల చేశారు. అంబేడ్కర్ పోరాట సమితి జనరల్ సెక్రటరీ ఎండ గోపాలరావు, ఎస్సీ, ఎస్టీ సేవా సమితి జిల్లా అధ్యక్షుడు ఆనందరావు పాల్గొన్నారు.

బెల్ట్ షాపులపై కఠిన చర్యలు

రామభద్రపురం, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో బెల్ట్ షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ వెలమల ప్రసాదరావు హెచ్చరించారు. ఆదివారం ఆయన స్థానిక పోలీసుస్టేషన్‌లో విలేకర్లతో మాట్లాడారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఎవరైనా బెల్ట్ షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. గ్రామాల్లో అవగాహన సదస్సులు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు.

పుస్తక పఠనం అలవరచుకోండి

తెర్లాం, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలని స్థానిక గ్రంథాలయ శాఖ అధికారి సీహెచ్ కృష్ణమూర్తి అన్నారు. గ్రంథాలయంలో ఆదివారం చదవడం మాకిష్టం కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులతో పుస్తకాలు చదివించారు.

జీసీసీతో జీడి ప్రాసెసింగ్ యూనిట్లు

గుమ్మలక్ష్మీపురం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): గిరిజన సహకార సంస్థ ద్వారా జీడిపిక్కల ప్రాసెసింగ్ యూనిట్లను ఏర్పాటు చేయడానికి ప్రయత్నిస్తున్నామని పార్వతీపురం జీసీసీ డివిజనల్ మేనేజర్ ఉరిటి మహేంద్రకుమార్ ఆదివారం తెలిపారు. పార్వతీపురం మన్యం జిల్లాలో సుమారు కోటి రూపాయలు వ్యయంతో రెండు జీడి ప్రాసెసింగ్ యూనిట్లును ఏర్పాట్లు చేయాలని నిర్ణయించామని చెప్పారు. అలాగే కొమరాడ మండలంలో జీసీసీ ద్వారా పెట్రోల్ బంకు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఇప్పటికే మండల కేంద్రంలో పెట్రోల్ బంకు వంట గ్యాస్ డీలర్‌షిప్ ద్వారా విజయవంతంగా నిర్వహిస్తున్నామని చెప్పారు.

స్మార్ట్ మీటర్ విధానాన్ని ఉపసంహరించుకోవాలి


ర్యాలీ నిర్వహిస్తున్న వామపక్ష నాయకులు

బెలగాం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం పెంచిన విద్యుత్ చార్జీలను, స్మార్ట్ విధానాన్ని ఉపసంహరించుకోవాలని వామపక్ష నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం స్థానిక సుందరయ్య భవనం నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్ వరకు ర్యాలీ నిర్వహించారు. రాష్ట్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం విద్యుత్ చార్జీలను పెంచి ప్రజలపై పెనుభారం మోపుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో వామపక్ష, ప్రజా సంఘాల నాయకులు రెడ్డి వేణు, వై.మన్మథరావు, ఇందిరా, నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించండి

- 12వ రోజుకు గురుకుల కాంట్రాక్టు ఉద్యోగుల దీక్షలు


దీక్ష శిబిరంలో నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

సీతంపేట రూరల్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): గురుకుల పాఠశాలల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల తమ సమస్యల పరిష్కారం కోరుతూ గత కొద్ది రోజులుగా చేస్తున్న దీక్షలు ఆదివారానికి 12వ రోజుకు చేరాయి. సీఆర్టీలతో సమానంగా జీతాలు ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని వారు డిమాండ్ చేశారు. ఈ దీక్ష శిబిరంలో ఉపాధ్యాయులు బి.గణేష్, కె.భవానీ, బి.భాగ్యలక్ష్మి, జి.రాజేశ్వరీ, గౌతమి, మోహనరావు పాల్గొన్నారు.

సామాజిక భవనం దుర్వినియోగం

- పశువులశాలగా మారిన వైనం
- చర్యలు తీసుకోని అధికారులు



సామాజిక భవనంలో పశువులు కట్టిన దృశ్యం

బొబ్బిలి రూరల్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ప్రజా అవసరాల కోసం ప్రభుత్వ నిధులతో ఏర్పాటుచేసిన భవనం పశువుల శాలగా మారింది. లక్షల్లో ప్రభుత్వ ధనం దుర్వినియోగం అవుతున్నా ఎవరూ పట్టించుకోని పరిస్థితి. ఇదీ బొబ్బిలి మండలంలోని పిరిడి గ్రామంలో గల సామాజిక భవనం దుస్థితి. గ్రామంలో సమావేశాలు, శుభకార్యాలు, ప్రభుత్వ సభలు, కార్యక్రమాలకు ఉపయోగించుకోవాలని ప్రభుత్వం సామాజిక భవనాన్ని నిర్మించింది. అయితే ప్రస్తుతం ఈ భవనంలో ఆవులు కట్టి పశువుల శాలగా ఉపయోగిస్తున్నారు. ఊరికి దూరంగా ఉండడంతో మందుబాబులకు, అలాగే అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారింది. చాలా సంవత్సరాలుగా ఈ భవనం ఇలా దుర్వినియోగం అవుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి గ్రామాల్లో గల సామాజిక భవనాన్ని వినియోగంలోకి తీసుకు రావాలని స్థానికులు కోరుతున్నారు.

విద్యుత్ చార్జీల పెంపు దారుణం

జియ్యమ్మవలస, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ చార్జీల పెంపు దారుణమని మాజీ ఉప ముఖ్యమంత్రి పాముల పుష్పశ్రీ వాణి అన్నారు. ఆదివారం చినమేరంగి గ్రామంలోని తన నివాసంలో ఆమె విలేకర్లతో మాట్లాడారు. ఎన్నికల ముందు అసలు విద్యుత్ చార్జీలు పెంచబోమని హామీ ఇచ్చిన చంద్రబాబు.. ముఖ్యమంత్రి అయిన తర్వాత ఆరు నెలల్లో రెండు సార్లు విద్యుత్ చార్జీలు పెంచి ప్రజలపై అదనపు భారం వేశారని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. తల్లికి వందనం, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, బీసీలకు 50 ఏళ్లకే పెన్షన్.. ఈ హామీలన్నీ ఏమయ్యాయని ఆమె ప్రశ్నించారు. ఎంపీపీ శెట్టి పద్మావతి, నాయకులు సుజాత, బలగ వెంకటరమణ పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి
మా అక్షరం - మీ ఆయుధం
ఆంధ్రజ్యోతి దినపత్రిక చందాదారులుగా చేరాలన్నా, పత్రిక సరఫరాలో ఎలాంటి సమస్యలు ఉన్నా ఈ నెంబర్లకు సంప్రదించగలరు.
ACM : 9985411514, విజయనగరం : 9985411533
పార్వతీపురం : 9985403035, సాలూరు : 9492900300

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

వీరఘట్టం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఫ్యాన్ మరమ్మతులు చేస్తుండగా విద్యుత్ షాక్‌కు గురై ఓ వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన వీరఘట్టం మండలంలోని మట్ట వెంకటాపురం గ్రామంలో ఆదివారం ఉదయం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన రాబిల్లి శంకరరావు(42) ఇంట్లో ఫ్యాన్ పాడవ్వడంతో మరమ్మతులు చేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురై, మృతి చెందాడు. ఆయనకు భార్య గోపమ్మ, ఇద్దరు కుమార్తెలు హాసిని, యమున ఉన్నారు. శంకరరావు వ్యవసాయ పనులు చేసుకుంటూ ఖాళీ సమయంలో కేబుల్ పనులు చేస్తుంటాడు.

నేడు ఉచిత డీఎస్సీ కోచింగ్ ప్రారంభం

పార్వతీపురం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): పార్వతీపురంలోని గిరిజన సామాజిక భవనంలో సోమవారం ఉదయం 10 గంటలకు మంత్రి గుమ్మిడి సంధ్యారాణి డీఎస్సీ కోచింగ్‌ను ప్రారంభిస్తున్నారు. ఈ కోచింగ్ రెండు నెలల పాటు కొనసాగుతుంది. ఈ కోచింగ్‌లో ఉచిత వసతి, భోజన సౌకర్యాలను ఐటీడీఏ ద్వారా ఏర్పాటు చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో మంత్రితో పాటు ఎమ్మెల్యే, కలెక్టర్, ఐటీడీఏ పీవో, సంబంధిత అధికారులు పాల్గొంటున్నారు.

మహాసభలను జయప్రదం చేయాలి

పాలకొండ, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): కురుపాంలో ఈనెల 10, 11 తేదీల్లో నిర్వహించనున్న సీపీఎం పదో జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని మండల కమిటీ కన్వీనర్ దావాల రమణారావు పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆదివారం పాలకొండలో పోస్టర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అర్తమూడి లక్ష్మణరావు, కాద రాము, దూసి దుర్గారావు, భానుచందర్ పాల్గొన్నారు.

గిరిజన యూనివర్సిటీని తరలించొద్దు

పాలకొండ, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): గిరిజన యూనివర్సిటీని తరలించకుండా జిల్లాలోనే నిర్మాణం కొనసాగించాలని సీపీఎం మండల కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు సింగన్నవలస పంచాయతీ మల్లంగూడలో ఆదివారం పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకులు భానుచందర్, దుర్గారావు, రాము, మజ్జి, రమేష్, రాజేష్, సాంబయ్య, జోషి మాట్లాడుతూ జిల్లాకు కేటాయించిన కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయాన్ని ప్రస్తుతం నిర్మిస్తున్న మెంటాడ మండలం కుంటినవలస వద్దనే కొనసాగించాలని కోరారు. కొత్తవలస వద్ద గిరిజన యూనివర్శిటీని కొనసాగిస్తామని ప్రకటించడం అర్థం లేనిదన్నారు.

దేవాలయాల భూముల పరిరక్షణే లక్ష్యం

భామిని, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): దేవాలయాల భూముల పరిరక్షణే లక్ష్యమని విశ్వహిందూ పరిషత్ లక్ష్యమని హైందవ ప్రచారకుడు ఆర్.మోహన్‌రావు అన్నారు. ఘనసర, గురండిలో హైందవ మత పెద్దలతో ఆయన ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జనవరి 5వ తేదీన విజయవాడలో నిర్వహించే హైందవ శంఖారావం బహిరంగ సభకు హిందూ బంధువులంతా తరలిరావాలి కోరారు. ఈ సందరంగా పోస్టర్లు ఆవిష్కరించారు. వీహెచ్‌పీ పార్వతీపురం జిల్లా కార్యదర్శి సి.రామారావు, ఎస్ఎస్ఎఫ్ మండల కన్వీనర్ ఏ.వెంకటరావు, హిందూ మత పెద్దలు పాల్గొన్నారు.

పోలి పాడ్యమికి ఏర్పాట్లు పూర్తి

గరుగుబిల్లి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): తోటపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి దేవస్థానం ఆవరణలో సోమవారం పోలిపాడ్యమి వేడుకలు నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేశారు. నదీ హారతులు ఇచ్చేందుకు అధిక సంఖ్యలో భక్తులు రానున్నారని ఆలయ ఈవో వీవీ సూర్యనారాయణ తెలిపారు. నది ప్రాంతంలో ప్రమాదాలు నెలకొనకుండా ఉండేందుకు హెచ్చరిక బోర్డులతో పాటు బారికేడ్లును ఏర్పాటు చేశామని చెప్పారు. సిబ్బందితో పాటు ఈతగాళ్లను అందుబాటులో ఉంచామన్నారు. ఆదివారం అర్ధరాత్రి నుంచే నది ప్రాంతానికి భక్తులు రానున్న దృష్ట్యా ప్రత్యేక ఏర్పాట్లు చేశామని తెలిపారు.


నాగావళి నది ప్రాంతంలో ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డులు

కొత్త జంట కోరుకునే పెళ్ళి కానుక
వివాహ మహోత్సవ శుభాకాంక్షలు
ఆంధ్రజ్యోతి లో
వివాహ ప్రకటన ఇవ్వటం ద్వారా
మీ ప్రతిష్ఠను పెంచుకోండి.
నవీన రీతిలో ఆహ్వానించి
బంధుమిత్రులను అలరించండి
- శుభాకాంక్షలు
- ధన్యవాదాలు
- వివాహ ఆహ్వానాలు
ప్రకటనలపై జి.ఎస్.టి. 5% అదనం
ప్రకటనలకు సంప్రదించండి
99854 11066